PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 114 | విజయవాడ, మంగళవారం 26 నవంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 26 November 2024 | Rs

సిఎన్‌జి ధరల మంట

- కిలోపై రూ.2 పెంపు
- బిజెపి ఎన్నికల రిటర్న్ గిఫ్ట్

3



భారత్ ఘన విజయం

తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా 295 పరుగుల తేడాతో చిత్తు

6

అదానీ లంచాలపై అట్టుడికిన పార్లమెంట్

- ప్రతిపక్షాల నిరసనల హోరుతో ఉభయ సభలు రేపటికి వాయిదా
- వక్ఫ్ జెపిసి, సంభాల్ హింసపై స్పీకర్‌తో ప్రతిపక్ష ఎంపీల భేటీ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదానీ ముడుపుల వ్యవహారంపై శీతాకాల సమావేశాల తొలి రోజున పార్లమెంటు అట్టుడికింది. దీనిపై సంయుక్త పార్లమెంటరీ సంఘం(జెపిసి)తో సమగ్ర విచారణ జరిపించాలని, పార్లమెంట్‌లో దీనిపై ప్రత్యేక చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. దీనికి ప్రభుత్వం ససేమిరా అనడంతో ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభా మధ్య భాగంలోకి దూసుకెళ్లి మోదానీకి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశాయి.. దీంతో పలు దఫాలు వాయిదా పడిన ఉభయ సభలు చివరికి బుధవారానికి వాయిదాపడ్డాయి.. రాజ్యాంగ అవతరణ దినోత్సవ వేడుకలు ఉన్నందున మంగళవారం పార్లమెంటుకు సెలవు. అదానీకి సంబంధించిన అంశాలపై చర్చకు ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా తీర్మాన నోటీసును లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభలో చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ తిరస్కరించారు. లోక్‌సభ ఉదయం ప్రారంభమైన వెంటనే ఇటీవల కాలంలో మరణించిన సభ్యులకు సంతాపం తెలియచేసింది. అనంతరం అదానీ వ్యవహారంపై సభ ప్రారంభమైన నాలుగు నిమిషాలకు ఒకసారి, మధ్యాహ్నం 12 గంటలకు మరోసారి, వాయిదా పడింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపి కె.సి.వేణుగోపాల్ మాట్లాడుతూ అదానీ అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం భయపడుతోందని విమర్శించారు. ఒక్క మాట కూడా వినేందుకు వారు సిద్ధంగా లేరని, అందుకే ఒక సెకనులోనే సభను వాయిదా వేశారని విమర్శించారు.

రాజ్యసభలోనూ గందరగోళం

రాజ్యసభ లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ముడుపుల వ్యవహారాన్ని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఈ అంశాన్ని లేవనెత్తేందుకు యత్నించగా చైర్మన్ ధన్‌ఖర్ అడ్డుకున్నారు. అదానీ అవినీతిపై చర్చించాల్సిందేనని ఆయన పట్టుపట్టారు. దీంతో రాజ్యసభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. అదానీ అవినీతి అంశం దేశాన్ని ప్రభావితం చేస్తోందని ఖర్గే అన్నారు. అదానీకి ప్రధాని నరేంద్ర మోడీ మద్దతుగా నిలుస్తున్నారని విమర్శించారు. షేర్ల తారుమారు, ఆర్థిక అక్రమాలు, అకౌంటింగ్ మోసాలు, బొగ్గు ధం ధరలను వాస్తవిక ధర కన్నా అనేక రెట్లు పెంచి చూపడం, వంటివాటికి తోడు లంచాల భాగోతం వంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నందున ఈ మొత్తం వ్యవహారంపై చర్చ జరగాలని సిపిఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ తన నోటీసులో డిమాండ్ చేశారు. వాయనాడ్ కొండచరియల బాధితులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని ఆయన కోరాఉ. దీంతో రాజ్యసభ సమావేశాలను చైర్మన్ ధన్‌కర్ బుధవారానికి వాయిదా వేశారు. 267వ నిబంధన కింద తనకు 13నోటీసులు అందాయని, వాటన్నింటినీ తిరస్కరించినట్లు చెప్పారు. వక్ఫ్ సవరణ బిల్లుపై పార్లమెంటులో చర్చ జరగాల్సి ఉండగా ఎంపీలు కె రాధాకృష్ణన్, ఈ టి మహ్మద్ బషీర్ బిల్లును వ్యతిరేకించారు. ప్రజలను విభజించే వ్యూహంలో భాగమే వక్ఫ్ సవరణ బిల్లు ఉద్దేశమన్నారు. వక్ఫ్ చట్ట సవరణ చాలా విస్తృతమైన పర్యవసానాలకు దారి తీస్తుందని రాధాకృష్ణన్ అన్నారు. సభ్యుల ఆందోళనలను పరిష్కరిస్తేనే బిల్లుకు మద్దతిస్తామని కాంగ్రెస్ నాయకుడు కెసి వేణుగోపాల్ అన్నారు. పదే పదే సభకు అంతరాయం కలగడంపై ప్రధాని నరేంద్ర మోడీ స్పందిస్తూ, కొత్త ఎంపిలు ఈ అంతరాయాలతో ఎక్కువగా ప్రభావితమవుతారని అన్నారు.. రాజ్యాంగం ఏర్పడి మంగళవారానికి 75 ఏళ్లు పూర్తి అవుతాయని అన్నారు. తాజాగా వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు మరింత బలం చేకూర్చాయని అన్నారు.

సంభాల్ హింసపై స్పీకర్‌తో ప్రతిపక్ష ఎంపిలు భేటీ

వక్ఫ్ (సవరణ) బిల్లు-2024పై పార్లమెంటు జాయింట్ కమిటీ (జెపిసి) సభ్యులుగా ఉన్న ప్రతిపక్ష ఎంపిలు సోమవారం పార్లమెంట్ కాంప్లెక్స్‌లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. తమ అభిప్రాయాలు విన్న తరువాత జెపిసి రిపోర్టు ప్రవేశపెట్టేందుకు, అందుకోసం జెపిసి కమిటీ పొడిగింపునకు స్పీకర్ హామీ ఇచ్చారని ఆప్ ఎంపి సంజయ్ సింగ్ తెలిపారు. "అన్ని పక్షాల వాదనలు విన్న తరువాత మాత్రమే జెపిసి నివేదికను తయారు చేయవచ్చు" అని అన్నారు. ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో జరిగిన హింసాకాండపై చర్చించాలని కోరుతూ సమాజ్‌వాదీ పార్టీ ఎంపిలందరూ సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. ప్రతినిధి బృందానికి ఆ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ నాయకత్వం వహించారు. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో చర్చించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



విజయవాడ బాలోత్సవ్ భవన్లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు, వి.శ్రీనివాసరావు, ఎంఎ బేబి

మోడీ పాలనలో స్వచ్ఛమైన అవినీతి

- అదానీ కుంభకోణమే నిదర్శనం
- చంద్రబాబు మౌనం ఎందుకు?
- సెకీ ఒప్పందం కొనసాగించడమంటే జగన్‌ను సమర్థించినట్లే
- అదానీ కుంభకోణంపై పార్లమెంటులో ప్రకటన చేయాలి
- విశాఖ స్టీలు ప్రైవేటీకరించబోమని ప్రధాని ప్రకటించాలి
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, బి.వి.రాఘవులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధాని మోడీ పాలనలో దేశంలో స్వచ్ఛమైన అవినీతి జరుగుతోందని, అదానీ కుంభకోణమే దీనికి నిదర్శనమని, అవినీతి వ్యవహారంపై పార్లమెంటులో స్పష్టమైన ప్రకటన చేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబీ, బి.వి.రాఘవులు అన్నారు. విజయవాడలో రెండు రోజులపాటు జరిగిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో వారు పాల్గొన్నారు. ప్రస్తుత రాజకీయాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్వహించాల్సిన పోరాటాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. వీటికి సంబంధించిన వివరాలను బాలోత్సవ్ భవన్లో జరిగిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి వారు వివరించారు. అదానీతో ఒప్పందానికి సంబంధించి జగన్‌మోహన్‌రెడ్డి తేలుకుట్టిన దొంగలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈ ఒప్పందం వల్ల రాష్ట్ర ప్రజలపై లక్షకోట్ల భారం పడుతుందని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉండగా దీనిపై విమర్శలు చేసిన టిడిపి నాయకులు ఇప్పుడు నోరెత్తడం లేదని విమర్శించారు. ఒప్పందంలో రూ.2029 కోట్ల అవినీతి ఉందని, అందులో రూ.1757 కోట్లు జగన్‌కు అందినట్లు, అమెరికా న్యాయవిభాగం తేల్చిందని, అటువంటప్పుడు ఒప్పందంలో ఏముందో వివరించేలా పత్రాలను బయటపెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. రూ.1.99 పైసలకు వచ్చే విద్యుత్‌ను రూ.2.49 పైసలకు ఎందుకు కొన్నారో బయటపెట్టాలన్నారు. ఒప్పందాన్ని కూడా రద్దు చేసుకోవాలన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఆ మిగతా 7లో

'ఇవి'లకు ప్రత్యేక టారిఫ్

- త్వరలో నిర్ణయించండి
- సమీక్షలో సిఎం ఆదేశం
- సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా రాష్ట్రం



సోలరైజేషన్‌పై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్‌తో నడిచే వాహనాలకు (ఎలక్ట్రిక్ వెహికల్స్-ఇవి)లకు ప్రత్యేక టారీఫ్‌ను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. సోలరైజేషన్‌పై రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు వాడే విద్యుత్‌కు విడిగా టారిఫ్ రూపొందించాలని, సాధ్యమైనంత త్వరగా ఈ మేరకు రేట్లను నిర్ణయించాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 55 వేల ఎలక్రిక్ వాహనాలు ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా సిఎంకు తెలిపారు. వీటిలో ట్రాన్స్‌పోర్టు, వ్యక్తిగత వాహనాలకు విడిగా ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని సిఎం అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇల్లు, కార్యాలయం సౌరశక్తిని ఒడిసిపట్టి విద్యుత్ ఉత్పత్తి, వినియోగంలో స్వావలంభన సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక వాతావరణ పరిస్థితుల కారణంగా సోలార్ ఉత్పత్తిలో తిరుగులేని ఫలితాలు సాధించవచ్చని చెప్పారు.

కుప్పంలో పైలట్ ప్రాజెక్టు: అధికారులు

పూర్తిస్థాయి సోలారైజేషన్‌లో భాగంగా కుప్పాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని చేపడుతున్న పనులను అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ కార్యాలయాలకు పూర్తిస్థాయిలో సౌర విద్యుత్ వినియోగంలోకి తెచ్చే అంశంపైనా అధికారులు సాధ్యసాధ్యాలను వివరించారు. కేంద్ర పథకాలపై రాష్ట్రం తీసుకోవాల్సిన చర్యలపై వెల్లడించారు. పిఎం సూర్యగర్-ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో ఏడాదిలో కోటి గృహాలు ఈ పథకం పరిధిలోకి తేవాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించుకుందని తెలిపారు. రాష్ట్రంలో 30 లక్షల ఇళ్లల్లో ఈ పథకాన్ని అమలు చేయాలని లక్ష్యం పెట్టుకునట్లు వివరించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 6,33,045 మంది గృహ విద్యుత్ వినియోగదారులు తమ సమ్మతి తెలుపుతూ రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో 100శాతం సౌర విద్యుత్ లక్ష్యమని వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాలపై సౌర పలకలు ఏర్పాటుకు రూ.262.25 కోట్ల ఖర్చు మిగతా7లో



ప్రారంభించిన అనంతరం కంటైనర్ ఆస్పత్రి వద్ద గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, వైద్యులు, అధికారులు

రాష్ట్రంలో తొలి కంటైనర్ ఆస్పత్రి

- పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి
- గిరిజనుల ఆరోగ్య అవసరాలను తీర్చడంలో ఇది ముందడుగు
- గిరి ఆరోగ్య కేంద్రంతో డోలీ మోత తప్పుతుందన్న మంత్రి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

గిరిజన ప్రాంతంలో ప్రాంతీయ ఆరోగ్య సేవల కోసం రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆస్పత్రిని రాష్ట్ర గిరిజన, మహిళా సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం కరడవలసలో ప్రారంభించారు. గిరి ఆరోగ్య కేంద్రంగా పిలిచే ఈ కంటైనర్ ఆస్పత్రి కోసం రూ.15 లక్షలు ఖర్చు చేశారు. ఈ కంటైనర్‌లో ఒక వైద్యుడి గది, రోగుల కోసం నాలుగు పడకలతో మరో గది ఉన్నాయి. 15 రకాల వైద్య సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. కంటైనర్ ఆస్పత్రి ప్రారంభోత్సం సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా రాష్ట్రంలో మిగతా 7లో

108 సర్వీసును ప్రభుత్వమే నిర్వహించాలి

- ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్సీ లక్ష్మణరావు
- ఉద్యోగులకు అండగా సిఐటియు : ఎవి నాగేశ్వరరావు
- నేటి నుంచి సమ్మె

3

లౌకికవాదం, సోషలిజం రాజ్యాంగ మౌలిక లక్షణాలు

- ఈ పదాలను తొలగించాలన్న పిటిషన్ కొట్టివేస్తూ సుప్రీం స్పష్టీకరణ

7

'వర్రా'కు రిమాండ్ పొడిగింపు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రరెడ్డి రిమాండ్‌ను కోర్టు పొడిగించింది. గతంలో విధించిన రిమాండ్ సోమవారం నాటికి ముగిసింది. జిల్లా మొదటి అడిషనల్ జడ్జి వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా వర్చువల్‌గా విచారించారు. అనంతరం ఆయనకు మరో 15 రోజుల పాటు రిమాండ్ పొడిగించారు.

విచారణకు హాజరైన వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలు

వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలు సోమవారం పోలీసు విచారణకు హాజరయ్యారు. పులివెందుల పోలీసులు నెల్లూరుకు చెందిన నరేంద్రరెడ్డి, విష్ణువర్దన్ రెడ్డిలను పిలిపించారు. రాష్ట్రంలోని రాజకీయ ప్రముఖులపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు చేసినందుకు వీరిపై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. పోలీసులు విచారణ రావాలని కోరడంతో వారు హాజరయ్యారు. వీరిని సుమారు రెండు గంటలపాటు విచారించినట్లు తెలిసింది.

జనవరి 10 నుంచి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనాలు

- టిటిడి

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో జనవరి 10న వైకుంఠ ఏకాదశి నిర్వహించనున్నట్లు టిటిడి అడిషనల్ ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ పదిరోజుల్లోనూ విఐపి బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. జనవరి పదిన స్వర్ణరథం ఊరేగింపు, 11న చక్రస్నానం ఎస్‌విబిసిలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు వెల్లడించారు. జనవరి 10 నుంచి 19 వరకు పది రోజుల పాటు యాత్రికులకు వైకుంఠ ద్వార దర్శనాలను టిటిడి కల్పించనుంది. ఇందుకు నలభై రోజులు మాత్రమే ఉండటంతో సన్నద్ధం కావాలని ఆయా శాఖల అధికారులందరినీ అడిషనల్ ఇఒ ఆదేశించారు. ఈ పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాల్లో సాధారణ యాత్రికులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిఎస్ఒ శ్రీధర్, సిఇ సత్య నారాయణ పాల్గొన్నారు.

గ్రీన్‌గ్రేస్ భవన యాజమాన్యంపై చర్యలు

- టిడిపి ఎమ్మెల్యే ధూళ్లిపాళ్ల నరేంద్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరులో నిర్మించిన హైరేజ్(గ్రీన్ గ్రేస్) అపార్టుమెంట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని టిడిపి ఎమ్మెల్యే ధూళ్లిపాళ్ల నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై విజయవాడలోని కాలుష్య నియంత్రణ మండలికి సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భజరంగ్ జూట్ మిల్లు ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తున్నారని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు తీసుకోకుండా భారీ ప్రాజెక్టులను ప్రారంభించారని పేర్కొన్నారు.

రైల్వే, వాటర్, ఫైర్ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా భారీ అపార్టుమెంట్ నిర్మించారని తెలిపారు. గత ఐదేళ్లల్లో ఒక్క అధికారి కూడా అటువైపు కన్నెత్తి చూడలేదన్నారు. మాజీమంత్రి అంబటి రాంబాబు అండతో అక్రమాలు చేశారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకుండా కళ్లు మూసుకుని ఐపిఎస్ అధికారులు సంజయ్, మాదిరెడ్డి ప్రతాప్ ఇద్దరూ ఎన్‌వోసిలు ఇచ్చారని విమర్శించారు. ఈ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

డిఇఓలుగా ఉన్న ఎడిలను రిలీవ్ చేయాలి

నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంవత్సరానికి పైబడి డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల్లో కొనసాగుతున్న అసిస్టెంట్ డైరెక్టర్లను వెంటనే రిలీవ్ చేయాలని, సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఎఫ్‌ఎసి ద్వారా డిఇఒ పోస్టుల్లో నియమించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. డిఇఓలుగా ఒక ఏడాది శిక్షణ కాలం పూర్తయినా అదే పోస్టుల్లో చాలామంది కొనసాగుతున్నారని తెలిపారు. దీనివల్ల విద్యావ్యవస్థ పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన ప్రధానోపాధ్యాయులను డిఇఓలుగా నియమించాలని వారు కోరారు.

అమరావతిలో ఐకానిక్ టవర్ల ప్లాను నార్మన్ ఫోస్టర్స్‌కే

- అసెంబ్లీ, హైకోర్టు భవనాల డిజైన్లు వారికే
- సిఆర్‌డిఎ అథారిటీలో ఆమోదం
- పట్టణాభివృద్ధిశాఖపై సిఎం సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాజధాని అమరావతి నిర్మాణంలో కీలకమైన ఐకానిక్ టవర్లు(ప్రభుత్వ కార్యాలయాల భవనాలు) ప్లాను నార్మన్ ఫోస్టర్స్ సంస్థకే అప్పగించారు. గతంలోనూ అదే సంస్థ ప్లాను ఇచ్చింది. దీన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. దీనిపై ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ కింద టెండర్లు ఆహ్వానించగా మరలా నార్మన్ ఫోస్టర్స్ దక్కించుకుంది. దీనికి సిఎం ఆధ్యక్షతన సోమవారం జరిగిన. సిఆర్‌డిఎ అథారిటీ ఆమోదం తెలిపింది. దీంతోపాటు హైకోర్టు, అసెంబ్లీ భవనాల ప్లాన్లనూ ఫోస్టర్స్ సంస్థ రూపొందించనుంది. ప్లానుల్లో మార్పులు లేకపోయినా గతంలో ఉన్న టెండర్లు రద్దు చేసిన నేపథ్యంలో మరలా టెండర్లు పిలవాల్సి వచ్చిందని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. సోమవారం ఉదయం పట్టణాభివృద్ధిశాఖపై సిఎం సమీక్ష నిర్వహించారు. అలాగే సిఆర్‌డిఎ అథారిటీ సమావేశమూ నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలను మంత్రి పి.నారాయణ మీడియాకు వివరించారు. అథారిటీ కూడా అనుమతి ఇచ్చిన నేపథ్యంలో టెండర్లు అప్పగించే ప్రక్రియ ఒకటీ రెండు రోజుల్లో పూర్తవుతుందని, వర్కు ఆర్డర్ కూడా ఇస్తున్నామని మంత్రి తెలిపారు. గతంలో ప్లాను మాత్రమే ఇచ్చారని, కొత్త టెండర్లలో పనులు పర్యవేక్షణ బాధ్యతను కూడా అప్పగిస్తున్నామని పేర్కొన్నారు. అమరావతికి సంధించి ప్రపంచబ్యాంకు బోర్డు ఆమోదం తెలపాల్సి ఉందని పేర్కొన్నారు. డిసెంబర్ నెల మొదటివారంలో బోర్డు సమావేశం జరిగే అవకాశం ఉందని, అప్పుడు అనుమతి ఇవ్వవచ్చని మంత్రి తెలిపారు. అలాగే ఎపి రాజధాని అమరావతి అని కేంద్రం కూడా పార్లమెంటులో తెలిపిందని, దీనికి అవసరమైతే గెజిట్ తీసుకొస్తామని చెప్పారు.

ముఖ్యంగా పట్టణ ప్రణాళిక విభాగంలో పెద్దఎత్తున సంస్కరణలు చేసినట్లు తెలిపారు. దీనిపై అనేక రాష్ట్రాల్లో ఉన్న పద్ధతులపై ఏడు బృందాలు పదిరాష్ట్రాల్లో తిరిగి నివేదిక అందించాయని తెలిపారు. హైరైజ్ భవనాలు కట్టుకునేవారికి సంబంధించి అనుమతుల్లో మార్పులు చేశామని పేర్కొన్నారు. ఇక ముందు యజమానికాకుండా లైసెన్స్‌డ్ సర్వేయర్ నిర్ణీత రుసుము కట్టి ప్లాను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేస్తే డీమ్డ్ అనుమతిగా పరిగణిస్తామని చెప్పారు. నిర్మాణాల్లో అక్రమాలు ఉంటే లైసెన్స్ రద్దు చేయడంతోపాటు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ నిర్మాణాలు పరిశీలిచేందుకు టాస్కుఫోర్స్ ఉంటుందని, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుందని పేర్కొన్నారు. అనుమతులకు సంబంధించి అన్ని విభాగాల సర్వర్లను కలిపి ఒకే పోర్టల్ ఏర్పాటు చేశామని చెప్పారు. రోడ్డుకోసం భవన స్థలాన్ని ఇస్తే ఇక ముందు టిడిఆర్ లేకుండానే ఎంత స్థలం ఇచ్చారో అంత నిర్మాణం చేసుకునే విధంగా నిబంధనల్లో మార్పులు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇప్పటి వరకూ 500 చదరపు మీటర్ల కంటే ఎక్కువ ఉన్న భవనాల్లో కమర్షియల్ ఏరియాల్లో సెల్లార్ పార్కింగ్ ఇచ్చామని, రెసిడెన్షియల్ ఇవ్వలేదని, బిల్డర్స్ అంతా 500 గజాల భవనాల్లోనూ సెల్లార్ పార్కింగ్ ఇవ్వాలని కోరగా ఇచ్చామని తెలిపారు. 120 మీటర్లు దాటి ఎంత ఎత్తుకట్టుకున్నా సెట్‌బ్యాక్స్ 20 మీటర్లు ఉండేలా నిబంధనలు మార్చినట్లు తెలిపారు. హైరైజ్ భవనాల్లో ఐదు అంతస్తుల్లో పార్కింగు కట్టుకునేలా అనుమతులు ఇచ్చామని పేర్కొన్నారు. 10 అంతస్తులు ఉండే భవనానికి ఒక ఫ్లోర్ రిక్రియేషన్‌కు అడిగారని, దాన్ని కూడా అనుమతించామని పేర్కొన్నారు. లేఅవుట్లు వేసే సమయంలో గతంలో 12 మీటర్లు వెడల్పు రోడ్డు వదలాలని నిబంధన ఉందని, దాన్ని సవరించి తొమ్మిది మీటర్లకు కుదించామని తెలిపారు. టిడిఆర్ బాండ్ల జారీలో తణుకు, తిరుపతిలో పెద్దఎత్తున అవినీతి జరిగిందని, దీనిపై సమగ్ర నివేదిక తయారు చేసి 15 రోజుల్లో అందించాలని సిఎం ఆదేశించారని పేర్కొన్నారు. 2019 ఫిబ్రవరిలో ఎఐఐబిలో రూ.5350 కోట్లకు అనుమతులు ఇచ్చిందని, ప్రాజెక్టు కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో మరో నాలుగేళ్లు పొడిగించాలని కోరగా అనుమతి వచ్చిందని తెలిపారు. దీనికి కొత్తగా టెండర్లు పిలుస్తామని చెప్పారు. అమృత్-2.0 కూడా రెండేళ్లలో పూర్తి చేయాలని సిఎం ఆదేశించినట్లు తెలిపారు.

ఆలయాల పవిత్రతను కాపాడుతాం

- దానికోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తాం
- పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆలయాల పవిత్రతను కాపాడటం తమ కర్తవ్యమని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో టెంపుల్, ఎకో, అడ్వెంచర్, హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి కార్యాచరణ, పర్యాటక ప్రదేశాల అభివృద్ధి తదితర అంశాలపై ఆమన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాల పవిత్రతనను కాపాడటం కోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. గ్రామస్థాయిలో ఈ తరహా సదస్సులను నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మాజీ ప్రధాని పివి నరసింహారావు దేవాదాయశాఖ మంత్రి గా ఉన్న సమయంలో యాత్ర బస్సుల పేరిట దివ్య క్షేత్ర దర్శనం ఏర్పాటు చేశారన్నారు. ఆ తరహా అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఎకో టూరిజంకోం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు దిశగా చర్యలు ప్రారంభించినట్లు పవన్‌కల్యాణ్ తెలిపారు. కర్నూలు జిల్లా ఆధోని, దొండపాడు, ఉమ్మడి కడపజిల్లా సిద్దవటం లాంటి ప్రాంతాల్లో విద్యార్థుల కోసం అడ్వెంచర్ థీమ్ పార్క్ ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. నంద్యాలలో ఏనుగుల క్యాంపులు ఉన్నాయని, గండికోట, హార్సిలీ హిల్స్‌లో అద్భుతమైన కొండలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో టూరిజం స్పాట్స్ ఎక్కడ ఏమున్నాయనే విషయం ప్రజలకు తెలియాలన్నారు. న్యూజిలాండ్, ఉక్రెయిన్ లాంటి దేశాలు చలనచిత్ర మాధ్యమాన్ని అందుకు ఎంచుకున్నాయని, సినిమాల ద్వారా పర్యాటక ప్రాంతాలకు తేలికగా ప్రచారం కల్పించవచ్చన్నారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్అండ్‌బి శాఖ మంత్రి బిసిజనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



డిజిపితో పోలీసుల బృందం

పోలీసులకు డిజిపి అభినందనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అఖిల భారత పోలీసు బ్యాండ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎపి పోలీసు అధికారులను డిజిపి ద్వారకా తిరుమలరావు సోమవారం అభినందించారు. నాగాలాండ్ రాష్ట్రం ధీమాపూర్‌లోని అస్సాం రైఫిల్స్‌లో ఈ నెల 16 నుంచి 22 వరకూ జరిగిన 25వ అఖిల భారత బ్యాండ్ కాంపిటీషన్‌లో బింగిల్ కాల్ పోటీలలో ఐజి (క్రీడలు) కెవి మోహన్‌రావు నేతృత్వంలోని తొమ్మిది మందితో కూడిన ఎపి పోలీసుల బృందం 3వ స్థానంలో నిలిచి, కాంస్య పతకాన్ని సాధించింది. ఈ పోటీలలో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర సాయుధ బలగాల నుంచి 24 బృందాలు పాల్గొన్నట్లు ఈ సందర్భంగా పోలీసు అధికారులు తెలిపారు.

సంక్షోభం దిశగా పశ్చిమాసియా

- పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలి
- 'పశ్చిమాసియా సంక్షోభం'పై సదస్సులో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



సదస్సులో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ

సొంత గడ్డపై బతకడం కోసం జీవన పోరాటం సాగిస్తున్న పాలస్తీనా ప్రజలకు మన దేశం యావత్తు అండగా నిలవడమే గాక మనదేశంలో మత ఉన్మాదంతో పాలన సాగిస్తున్న మోడీ విధానాలపై పాలస్తీనియన్ల స్ఫూర్తితో పోరాడాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ పిలుపునిచ్చారు. 'పశ్చిమాసియా సంక్షోభం'పై విశాఖ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రిటైర్డ్ అధ్యాపకులు కె.పద్మ అధ్యక్షతన గురజాడ అధ్యయన వేదిక, అల్లూరి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యాన జరిగిన సదస్సులో శర్మ ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికన్ సామ్రాజ్యవాదం అండతో పౌరులు, నివాస ప్రాంతాలపై ఇజ్రాయిల్ తెగబడుతూ గల్ఫ్ దేశాలను నిప్పుల కుంపటిగా మార్చేస్తోందన్నారు.

మనదేశంలో మతోన్మాదంతో చెలరేగిపోతున్న ప్రధాని మోడీకి, అక్కడ జాత్యాహంకారంతో రెచ్చిపోతున్న నెతన్యాహూకీ తేడా ఏమీలేదన్నారు. గాజాపై అనైతిక దాడులను, ఇజ్రాయెల్ జాత్యాహంకారాన్ని ఖండిస్తూ ప్రపంచంలోని అన్ని దేశాల రాజధానుల్లోనూ నిరసనలు జరగ్గా మనదేశంలోని న్యూ ఢిల్లీకి ఏమీ పట్టలేదన్నారు. పాలస్తీనా తదితర ప్రాంతాల్లో విలువైన బంగారం నిల్వలు, ముడిచమురును గుప్పెట్లో పెట్టుకునే వ్యూహం ఇజ్రాయిల్ - అమెరికాకు ఉన్నందునే యుద్ధాన్ని సాగదీస్తున్నాయన్నారు. మన దేశంలో ముస్లిములపై మోడీ, సంఘ పరివార్ శక్తులు దాడులు చేసినట్టే పాలస్తీనావాసులపై నెతన్యాహూ దాడులతో విరుచుకుపడుతున్నాడన్నారు. ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ క్షేత్రపాల్ మాట్లాడుతూ.. పశ్చిమాసియా యుద్ధం ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభం దిశగా తీసుకెళ్తోందన్నారు. భారతీయులు గల్ఫ్ దేశాల్లో కోటి మందికిపైగా వివిధ పనుల్లో ఉన్నారని, వారంతా దేశానికి వస్తే నిరుద్యోగం ఇక్కడ ఇంకా పెరగదా ? అని ప్రశ్నించారు. రిటైర్డ్ ఎయు ప్రొఫెసర్ డాక్టర్ ఎం.నళిని మాట్లాడుతూ.. 12 నెలలుగా ఇజ్రాయిల్ బాంబు దాడులతో పాలస్తీనాలో పిల్లలు, మహిళలను వేల సంఖ్యలో పొట్టన పెట్టుకుందని ఆవేదన చెందారు. యుద్ధం అంటే సైన్యం మరో సైన్యంతో తలపడాలని, కానీ పాలస్తీనాలో ఇజ్రాయిల్ పౌరసమాజంపై విరుచుకుపడడం విస్మయం కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షులు అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

'సెకీ'ఒప్పందంలో నాకు సంబంధం లేదు : బాలినేని

ప్రజాశక్తి - ఒంగోలు బ్యూరో

సెకీతో ఒప్పందం విషయంలో తనకు ఏ మాత్రమూ సంబంధం లేదని జనసేన నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనకు రాజకీయ భిక్ష పెట్టినట్లు జనసేనలో చేరినప్పుడే చెప్పానని తెలిపారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మెప్పు కోసమే తాను మాట్లాడుతున్నట్లు వైసిపి నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బాలినేని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ఆర్‌పై అభిమానంతో ఆయన మరణం తర్వాత మంత్రి, ఎమ్మెల్యే పదవులు వదులుకొని వైసిపిలోకి వెళ్లానని గుర్తుచేశారు. రాజశేఖర్‌రెడ్డి కుటుంబమంటే జగన్ ఒక్కరేనా? విజయమ్మ, షర్మిల కాదా.? అని ప్రశ్నించారు. వారిపై అసభ్య పోస్టులు పెడితే ఆ కుటుంబం కానట్లు పట్టించుకోరా? అని నిలదీశారు. తాను ఎవరి మెప్పు కోసం పనిచేయడం లేదని.. ఈ విషయాన్ని చెవిరెడ్డి గుర్తు పెట్టుకోవాలన్నారు. తిట్టిన వాళ్లకే టికెట్లు ఇస్తామనే సంప్రదాయం ఎవరు కొనసాగిస్తున్నారో తెలుసని వ్యాఖ్యానించారు. 'ఎవరినీ విమర్శించను అని చెప్పా.. అలా చేస్తే నేను కూడా వాస్తవాలు చెప్పాల్సి వస్తుంది. అదానీతో విద్యుత్ ఒప్పందాల్లో రూ.1,750 కోట్ల లంచం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అప్పట్లో విద్యుత్ మంత్రిగా ఉన్నందున ఏం జరిగిందో చెప్పా... సెకీతో ఒప్పందం అంశంలో నాకు ఏమాత్రమూ సంబంధం లేదు. సిఎండి ఫైల్ కూడా నా వద్దకు రాలేదు.' అని అన్నారు. తాను వ్యక్తిగత విమర్శలు చేస్తే ఎవరూ తట్టుకోలేరని, పవన్ వెంట ఉంటూ టిడిపి కూటమితో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. చిత్తూరు జిల్లా అధ్యక్షుడిని తీసుకొచ్చి ఒంగోలులో టికెట్ ఇస్తారా? అలా చేయడం తనకు నచ్చలేదని, అందుకే దానికి అంగీకరించలేదని పేర్కొన్నారు. వైసిపి నుంచి ఎందుకు బయటకు వెళ్లాల్సి వచ్చిందో మొత్తం చెబుతానని, ధైర్యం ఉంటే చెవిరెడ్డి బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

అదానీ సంస్థతో ఒప్పందాలు రద్దు చేయాలి

- పిసిసి చీఫ్ షర్మిల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అదానీ సంస్థతో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు తక్షణమే రద్దు చేయాలని, ఆ సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని పిసిసి చీఫ్ వై.ఎస్ షర్మిల కోరారు. ఈ అంశంపై సిఎం చంద్రబాబుకు సోమవారం లేఖ రాశారు. అదానీతో అక్రమ డీల్ కారణంగా 25 ఏళ్ల పాటు రాష్ట్ర ప్రజలపై పడేభారం రూ.1.50 లక్షల కోట్లని, కాబట్టి ఈ ఒప్పందాలను రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఒప్పందాల కారణంగా మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి, అదానీ నుంచి అందుకున్న రూ.1,750 కోట్లు ముడుపుల విషయంలో సిబిఐ లేక సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. 25 ఏళ్ల పాటు అదాని సంస్థ వసూలు చేసుకునే రూ.1.50 లక్షల కోట్లలో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి వాటా ఎంతో తేల్చాలని కోరారు. ఇప్పటికే సర్దుబాటు చార్జీల పేరిట ప్రజల నెత్తిన రూ.17వేల కోట్లు భారం మోపారని, దీనికి అదనంగా అదానీ సంస్థతో ఒప్పందాల వల్ల ఏటా రూ.5 వేల కోట్లు భారం పడనుందన్నారు. మరోవైపు సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం కోసం అదానీ సంస్థకు రాష్ట్రంలో లక్షలాది ఎకరాలను దారాదత్తం చేశారని చెప్పారు. వైఎస్ఆర్సిపి ఐదేళ్ల పాలనలో అదానీ నుంచి జగన్మోహన్‌రెడ్డికి వేల కోట్లు ముడుపులు ముట్టాయి తప్ప...రాష్ట్రంలో ఒక్కరికి కూడా ఉద్యోగం రాలేదన్నారు. గంగవరం పోర్టులో ప్రభుత్వ వాటాను అదానీకి అమ్మడంపై విచారణ నిర్వహించాలని షర్మిల కోరారు. ఈ వ్యవహారాలపై కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదని, ముడుపుల విషయంలో నోరు మెదపడం లేదన్నారు. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, రోప్ వే, బీచ్ శాండ్ ఉత్పత్తుల ప్రాజెక్టులు, సోలార్, హైడ్రో పవర్ ప్రాజెక్టులు అదానీకి కట్టబెట్టేందుకు ప్రస్తుత ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని తెలుస్తుందన్నారు.

రోడ్లు బాగుంటే ప్రజలు ఆమోదిస్తారు

- స్టేట్ హైవే రోడ్ల టోల్ పై సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జాతీయ రహదారుల తరహాలోనే రాష్ట్ర, జిల్లా రహదారులు కూడా బాగుంటే పిపిపి పద్ధతిని, టోల్ ఛార్జీలను ప్రజలు ఆమోదిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆర్అండ్‌బి రహదారుల పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ నేషనల్ హైవేల విషయంలో ఎలా పిపిపి పద్ధతికి ప్రజలు ఆమోదం లభించిందో, మంచి రోడ్లు అందుబాటులోకి తెస్తే ఇతర రోడ్ల విషయంలోనూ అటువంటి స్పందనే వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో పిపిపి మోడ్‌లో మొదటిఫేజ్ కింద 18 స్టేట్ హైవే రోడ్లు 1,307 కిలోమీటర్లు మేర నిర్మించేందుకు డిపిఆర్‌లు తయారు చేసి సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. టోల్ ఛార్జీల విషయంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు,ట్రాక్టర్లతో పాటు ఇంకా ఎవరెవరికి మినహాయింపు ఇవ్వాలనేది కూడా చర్చించాలన్నారు. కేవలం భారీ వాహనాలు, ట్రాన్స్‌పోర్టు వాహనాలకు మాత్రమే రుసుము వసూలుచేసే విధానంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రజలపై భారం వేయకుండా రోడ్ల నిర్మాణ సంస్థలకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్ ప్రభుత్వం చెల్లిస్తుందని సిఎం చంద్రబాబు తెలపారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లోని అంతర్గత రహదారుల పరిస్థితిపై కూడా సిఎం చందబాబు ఆరా తీశారు. గ్రామాల్లో మొత్తం 68వేల కిలోమీటర్లు ఇంటర్నల్ రోడ్లు ఉన్నాయని, వీటిలో 55వేల కిలోమీటర్ల మేర సిసి రోడ్ల నిర్మాణం జరిగిందని సిఎం తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయాంలో కేవలం 6వేలకిలోమీటర్లు మాత్రమే పనులు జరిగాయన్నారు. కేంద్రం తాజాగా మరో రూ.275కోట్లు పంచాయతీలకు విడుదల చేసిందని వాటి ద్వారా కూడా పనులు చేపట్టాలన్నారు. నాబార్డు నిధులద్వారా పంచాయతీరోడ్లు నిర్మించాలని సిఎం సూచించారు. గ్రామాల నుంచి స్టేట్ హైవేలకు , నేషనల్ హైవేలకు కనెక్టివిటీ పెంచే అంశాలపైన దృష్టి పెట్టాలని అధికారులకు సిఎం ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.861కోట్లతో చేపట్టిన గుంతలు లేని రోడ్లు కార్యక్రమం సంక్రాంతి నాటికి పూర్తి కావాలన్నారు. మొక్కుబడిగా పనులు చేస్తే సహించేది లేదన్నారు. నాణ్యత లేక పోతే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని అధికారులను సిఎం ఆదేశించారు.

పిపిపి మోడ్‌లో చేపట్టనున్న రహదారులు: (మొదటి ఫేజ్)

చిలకలపాలెం -రామభద్రపురం- రాయగడ
విజయనగరం - పాలకొండభీమునిపట్నం - నర్సీపట్నం
కాకినాడ - జొన్నాడకాకినాడ- రాజమహేంద్రవరం- కెనాల్‌ఏలూరు - జంగారెడ్డిగూడెంగుంటూరు - పర్చూరు గుంటూరు -బాపట్ల మంగళగిరి - తెనాలి- నారా కోడూరు బేస్తవారిపేట - ఒంగోలు- రాజంపేట గూడూరు- ప్యాపిలి -బనగానిపల్లి దామాజిపల్లి - తాడిపత్రి జమ్మలమడుగు - కొలిమిగుండ్ల సోమందేవపల్లి - హిందూపురం- తూముకుంట

శ్రీశైలం నుంచి హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రణాళికలు

శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంంబాబునాయుడు ఆదేశించారు. ఈ సమస్యపై సోమవారం అర్అండ్‌బి, ఎన్‌హెచ్‌ఎఐ అధికారులతో చర్చించిన ఆయన శ్రీశైలం ఘాట్ రోడ్డుతోపాటు దేవాలయానికి వెళ్లే మార్గాల్లో వాహనాల రద్దీని చక్కదిద్దాలని సూచించారు. అవసరమైతే పొరుగు రాష్ట్రాల అధికారులతో సమస్యపై చర్చించి సమన్వయంతో యాత్రికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శాశ్వత పరిష్కారం కల్పించేందుకు సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులకు నిర్దేశించారు. భవిష్యత్తులో పెరిగే రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలను స్వయంగా పరిశీలించి, పరిష్కారానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.



'నేషనల్ ఇ-విధాన్' అమలుకు ఎపి ఒప్పందం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నేషనల్ ఇ విధాన్ అప్లికేషన్ (ఎన్ఇవిఎ) ప్రాజెక్టులో భాగస్వామి అయ్యేందుకు ఆంధ్ర ప్రదేశ్ శాసన వ్యవస్థ సోమవారం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్ శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేను రాజు, శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు సమక్షంలో ఈ ఒప్పందంపై సోమవారం సంతకాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి సత్య ప్రకాష్ ఈ ఒప్పందంపై సభాపతుల సమక్షంలో సంతకాలు చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఉమంగ్ నరులా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎపి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఒప్పంద విషయాలను వెల్లడించారు.

10న సిపిఎస్ ఉద్యోగుల సభ విజయవంతానికి ఎపిసిపిఎస్ఇఎ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 10వ తేదీన జరిగే సిపిఎస్ ఉద్యోగుల సభను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎపిసిపిఎస్ఇ) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె సతీష్, సిఎం దాస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించే సభకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఇతర ప్రభుత్వ పెద్దలు, ఉద్యోగ సంఘ నాయకులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. సిపిఎస్ ఉద్యోగులు పెద్దఎత్తున హాజరై తమ సమస్య తీవ్రతను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లటంలో భాగస్వాములు కావాలని కోరారు. గత ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దు చేస్తానన్న హామీ తుంగలో తొక్కి జిపిఎస్ అనే మోసపూరిత విధానం తీసుకొచ్చారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సిపిఎస్ ఉద్యోగులతో చర్చించి ఆమోదయోగ్యమైన పెన్షన్ తీసుకొస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. సిపిఎస్ ఉద్యోగి పదవి విరమణ పొందిన తరువాత వెయ్యి నుంచి రెండు వేల రూపాయలు మాత్రమే పెన్షన్ పొందుతారని తెలిపారు.

ఎంబిబిఎస్ సీట్ల భర్తీ సముచితమే : హైకోర్టు

ప్రజాశక్తి - అమరావతి

కర్నూలులోని విశ్వభారతి మెడికల్ కాలేజీ, అమలాపురంలోని కోనసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ ఫౌండేషన్ మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద పెరిగిన 75 ఎంబిబిఎస్ సీట్లు భర్తీ చేయడం సముచితమని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు కౌన్సిలింగ్కు నీట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను అనుమతించాలని సూచన చేసింది. ఈ మేరకు అమలు చేయకపోతే తక్కువ ప్రతిభ ఉన్న వారితో సీట్లను భర్తీకి ఆస్కారం ఉంటుందని చెప్పింది. ర్యాంకులు సాధించిన వారితో స్పెషల్ స్ట్రే వెకెన్సీ రౌండ్ కింద 75 సీట్లను కేటాయిస్తూ వైద్య విశ్వవిద్యాలయం తీసుకున్న నిర్ణయాన్ని జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ మండవ కిరణ్మయిలతో కూడిన డివిజన్ బెంచ్ తప్పుపట్టింది. సమగ్ర విచారణ ఈ నెల 26న జరుపుతామని ప్రకటించింది. మెడికల్ కాలేజీల్లో పలు విడతల్లో సీట్ల భర్తీ ప్రక్రియను చేపట్టాక కోనసీమ మెడికల్ కాలేజీకి 25 సీట్లు, కర్నూలు విశ్వభారతి మెడికల్ కాలేజీకి 50 సీట్లు పెంచుతూ ఎన్ఎంసీ ఉత్తర్వులు ఇచ్చింది. వాటి భర్తీకి ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం చర్యలు చేపట్టింది. సీట్ల కేటాయింపు కూడా చేసింది. అప్పటికే ఆ కాలేజీల్లో ఎంబిడిఎస్, బిడిఎస్ కోర్సుల్లో సీట్లు పొందిన నలుగురు విద్యార్థినులు సవాల్ చేస్తూ లంచ్‌మోషన్ పిటిషన్ వేశారు. తాజాగా చేపట్టిన 75 సీట్ల కౌన్సిలింగ్కు అనుమతించకపోవడంతో వీరి కంటే తక్కువ మార్కులు వచ్చిన వారికి ఎంబిబిఎస్ సీటు దక్కే పరిస్థితి ఉందన్నారు. దీనిపై హైకోర్టు.. అన్ని సీట్లు ప్రతిభ ఆధారంగానే భర్తీ చేయాలంది. విచారణ మంగళవారానికి వాయిదా పడింది.

ప్రజాశక్తి
www.prajasakti.com

నెల్లూరు కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నం

- ఇంటి తప్పుడు పత్రాలతో వైసిపి నేతల అరాచకం : బాధితుడు

ప్రజాశక్తి - నెల్లూరు

నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. సకాలంలో పోలీసులు స్పందించడంతో ప్రమాదం తప్పింది. బాధితుడి వివరాల మేరకు..కావలి మండలం బుడంగుంట గ్రామానికి చెందిన సింగంశెట్టి బాలయ్యకు 2007లో ఇందిరమ్మ పథకం కింద ఇంటిని నిర్మించుకున్నారు. అదే గ్రామానికి చెందిన వైసిపి నేత కృష్ణమూర్తి, హరిబాబు తప్పుడు పత్రాలు సృష్టించి ఇల్లు తమదేనని వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ఐదేళ్లుగా అధికారులకు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు వచ్చి ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసులు సకాలంలో స్పందించి ఒంటిపై నీరు పోశారు. డిఆర్‌ఒ బాధితుడి వద్దకు చేరుకుని సమస్యను తెలుసుకున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

నేటి నుంచి 4రోజులు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈనెల 26నుంచి 29 వరకు (నాలుగు రోజులు) ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు గ్రామ వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆధార్ స్పెషల్ క్యాంపులు గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో ఎంపిక చేసిన పాఠశాలలు, కళాశాలలతోపాటు గిరిజన ప్రాంతాలు, అంగన్‌వాడీ సెంటర్లలో కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు ఆధార్ నమోదు చేసుకోని ప్రతి ఒక్కరి ఆధార్ నమోదయ్యే విధంగా చర్యలు చేపట్టాలని గిరిజన సంక్షేమశాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖ, వికలాంగుల శాఖలకు గ్రామ వార్డు సచివాలయాల శాఖ ఆదేశాలు ఇచ్చింది. .

ఎస్‌వి జూలో బెంగాల్ టైగర్ మృతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో 'మధు' అనే మగ బెంగాల్ టైగర్ అనారోగ్య కారణాలతో సోమవారం మృత్యువాత పడినట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. మధును 2018లో బెంగళూరు లోని బన్నెరగట్ట బయోలాజికల్ పార్క్ నుండి జంతు మార్పిడి పద్ధతి ద్వారా ఇక్కడికి తీసుకువచ్చామన్నారు. అప్పటి నుండి ఇక్కడే సంరక్షించబడుతోంది. సోమవారం ఉదయం 9:20 గంటలకు మధు మరణించిందని, వెటర్నరీ యూనివర్సిటీ పాథాలజీ విభాగానికి శవ పరీక్ష నిమిత్తం తరలించామన్నారు. మధు మృతికి వృద్ధాప్యం, బహుళ అవయవ వైఫల్యాలు కారణమని ఇక్కడి వైద్యుల బృందం నివేదించిందని సెల్వర్ తెలిపారు.

108 సర్వీసును ప్రభుత్వమే నిర్వహించాలి

- ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్సీ లక్ష్మణరావు
- ఉద్యోగులకు అండగా సిఐటియు: ఎవి నాగేశ్వరరావు
- నేటి నుంచి సమ్మె : 108 యూనియన్ నాయకులు



108 ఉద్యోగుల ధర్నాలో పాల్గొన్న లక్ష్మణరావు, నాగేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ

రాష్ట్ర ప్రభుత్వం 108 ఉద్యోగ సంఘం నేతలతో చర్చలు జరిపి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని,108 సర్వీస్‌ను ప్రభుత్వమే నిర్వహించాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఉద్యమం ఉధృతమయితే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తోందని ఆయన హెచ్చరించారు. విజయవాడ ధర్నా చౌక్‌లో ఎపి 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో లక్ష్మణరావు పాల్గొని మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కొవిడ్ కాలంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా 108 ఉద్యోగులు పని చేశారని గుర్తు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎనిమిది గంటల పని విధానానికి తిలోదకాలిచ్చిన ప్రభుత్వాలు 108 సర్వీసు ఉద్యోగులతో 12 గంటల పాటు పని చేయించుకోవడం దుర్మార్గమన్నారు. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి చొరవ తీసుకోవాలని కోరారు. ఎపి 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ...108 ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అమానుషంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను పరిష్కరించడం లేదని, వారు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని పేర్కొన్నారు. 108 యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.కిరణ్‌కుమార్, కెవివి నరసింహారావు మాట్లాడుతూ.. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని, దీంతో ఈ నెల 26 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు సమ్మెలోకి వెళ్తున్నారని తెలిపారు. ప్రయివేటు ఏజెన్సీలు మారినప్పుడల్లా ప్రతి ఉద్యోగి కనీసంగా రూ. 50 వేలు నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఏడాది ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా సర్వీసులు నిలిపివేసి సమ్మెలోకి వెళ్తామని రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు తీర్మానించారు.

రిలే దీక్షల అనంతరం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు, యునైటెడ్ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ముజఫర్ అహ్మద్, హెల్త్ అండ్ మెడికల్ (హంస) ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రామకృష్ణ, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జి ఉమాశంకర్, వైసిపి డాక్టర్ సెల్ నాయకులు డాక్టర్ బాబూషేక్, బిసిసెల్ నాయకులు కె నాగరాజు, పౌరసంక్షేమ సంఘం నాయకులు పి కృష్ణమూర్తి, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు. 108 ఉద్యోగుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

సోషల్ మీడియాలోనూ మహిళలపై హింస

- సేఫ్ సదస్సులో ప్రొఫెసర్ అనిత
- మూఢ నమ్మకాలను ప్రశ్నించాలన్న దివాకర్‌బాబు



సదస్సులో మాట్లాడుతున్న అనిత

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ఇటీవల కాలంలో సోషల్ మీడియాలోనూ మహిళలపై అనేక విధాలుగా హింస జరుగుతోందని, ఇటువంటి సంఘటనలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.అనిత కోరారు. చట్టాల గురించి ప్రతి ఒక్క మహిళా తెలుసుకోవాలన్నారు. 'మహిళలపై హింస నిర్మూలన కోసం అంతర్జాతీయ దినోత్సవం' సందర్భంగా సేఫ్ విజయవాడ కమిటీ ఆధ్వర్యంలో మొఘల్‌రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో సోమవారం సదస్సు జరిగింది. తొలుత సేఫ్ అధ్యక్షురాలు జ్యోత్స్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం అనిత మాట్లాడుతూ... నేడు అన్ని రంగాల్లోనూ మహిళలు హింసకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకూ చట్టాలు ఉన్నాయని తమపై జరిగే హింస పట్ల ధైర్యంగా పోరాడాలని కోరారు. సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.దివాకర్ బాబు మాట్లాడుతూ... సమాజంలో పురుషాధిక్యత కారణంగా మహిళలపై అనేక దాడులు జరగడంతో పాటు, హింసకు గురవుతున్నారని తెలిపారు. విద్యా విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత కాలపు ఆలోచనలు, విశ్వాసాలు, మూఢ నమ్మకాల గురించి ప్రశ్నించాలని కోరారు. ఐలు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాడాలని, అందుకు సేఫ్ సంస్థతో పాటు పలువురు కలిసి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమానికి సేఫ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ టి.విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. పిబి.సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మేకా రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో పిఎస్‌ఎల్‌సి-59, 60 ప్రయోగం

- సన్నాహాలు చేస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట (తిరుపతి)

సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి డిసెంబర్‌లో రెండు ప్రయోగాలు జరగనున్నాయి. మొదటి ప్రయోగం డిసెంబర్ 4న పిఎస్‌ఎల్‌వి-సి 59, రెండవ ప్రయోగం డిసెంబర్ 24న పిఎస్-ఎల్‌వి-సి 60. షార్‌లోని మొదటి ప్రయోగ వేదికకు సంబంధించి మొబైల్ సర్వీస్ టవర్ (ఎం.ఎస్.టి)లో పిఎస్‌ఎల్‌వి-సి 59, పిఎస్‌ఎల్‌వి ఇంటిగ్రేషన్ బిల్డింగ్‌లో పిఎస్‌ఎల్‌వి- సి 60 రాకెట్ అనుసంధానం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పిఎస్‌ఎల్‌వి -సి 59 రాకెట్ ద్వారా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా -3 ఉపగ్రహంతో పాటు మరో నాలుగు చిన్న తరహా ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగించనున్నారు. పిఎస్‌ఎల్‌వి-సి 60 ద్వారా రీశాట్-1బి అనే ఉపగ్రహంతో పాటు మరో నాలుగు వాణిజ్యపరమైన ఉపగ్రహాలను ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు.

సెకి ఒప్పందంలో ఆర్థికశాఖ అత్యుత్సాహం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వివాదాస్పదంగా మారిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి) ఒప్పదంలో ఆర్థికశాఖ అత్యుత్సాహంతో వ్యవహరించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒప్పందానికి సంబంధించిన ఫైళ్ల రూపకల్పన నుండి హడివిడిగా సంతకాలు చేయించడంతో పాటు, కేబినెట్ ఆమోదం పొందడం వరకు ఆర్థికశాఖకు చెందిన ఇద్దరు అధికారులు కీలకపాత్ర పోషించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. ఈ మేరకు కొంత సమాచరం సిఎం పేషీకి చేరినట్లు తెలిసింది. దీంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

తాజాగా ముఖ్యమంత్రి కార్యాలయంలో కూడా ఇదే అంశంపై చర్చ జరుగుతున్నట్లు తెలిసింది. వీరితో పాటు, విద్యుత్‌శాఖలోని ఒకరిద్దరు ఉన్నతాధికారులకు కూడా అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ఒప్పందానికి సంబంధించిన సంకేతాలు ముందుగానే అందాయని చెబుతున్నారు. ఆర్థికశాఖ కుచెందిన అధికారుల పాత్ర ఉన్నతస్థాయిలో పెద్ద చర్చకు తావిస్తోంది. ఇప్పటికే ఈ శాఖ అధికారులపై అక్రమ బిల్లుల చెల్లింపులు, భారీగా సేకరించిన రుణాలు, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా చేసిన అప్పుల్లో అక్రమాలు, ఆర్థికశాఖ నియమావళికి విరుద్ధంగా కార్యక్రమాలు చేశారన్న ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ హయంలోనే వీరిపై గవర్నర్‌కు, కేంద్ర ఆర్థికశాఖకు కూడా ఫిర్యాదులు అందినట్లు సమాచారం. తాజాగా ఈ ఇద్దరిపై బిజెపికి చెందిన లోక్ సభ సభ్యుడు సిఎం రమేష్ కేంద్రానికి ఫిర్యాదు చేయడంతో అక్కడి నుండి రాష్ట్ర ఆర్థికశాఖకు లేఖ రావడం కూడా గమనార్హం.

ఇప్పుడు తాజా కుంభకోనంలోనూ అదే అధికారులపై ఆరోపణలు వస్తుండడం గమనార్హం. సెకి ఒప్పంద సమయంలో వారిద్దరే ఆర్థికశాఖలో కీలకంగా వ్యవహరించడం, నాటి ముఖ్యమంత్రి పేషీ నుంచి వచ్చిన ఆదేశాలను తూచ తప్పక పాటించడం జరిగిందని అంటున్నారు. దీనికి సంబంధించి పూర్తిస్థాయి వివరాలను సిఎం కార్యాలయ అధికారులు సేకరిస్తున్నారు.

బాలినేనివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

- గత ప్రభుత్వం కంటే తక్కువ ధరకే విద్యుత్తు కొనుగోలు
- ఎమ్మెల్యేలు, ఎంపిలు నియోజకవర్గాలు మారడం సర్వ సాధారణం : చెవిరెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డివి బ్లాక్ మెయిల్ రాజకీయాలని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, వైసిపి నాయకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రి హోదాలో విద్యుత్ కొనుగోలుపై బాలినేని శ్రీనివాసరెడ్డి రెండుసార్లు సంతకం చేశారని, చంద్రబాబు ప్రభుత్వం కంటే అతి తక్కువ ధరలో యూనిట్ విద్యుత్ రూ. 2.45 పైసలకే కొనుగోలు చేశామన్నారు. దీని పైన కూడా రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిలు నియోజకవర్గాలు మారడం సర్వసాధారణమని, రాజకీయ వ్యూహాల్లో భాగంగా ఇవి జరుగుతాయని చెప్పారు. బాలనేని సైతం నియోజకవర్గం మారారని, టిడిపి అధినేత చంద్రబాబు చంద్రగిరిని వదిలి కుప్పానికి వెళ్లారని, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సొంత నియోజకవర్గం వదిలి పిఠాపురానికి వెళ్లారని, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరీ సైతం తన నియోజకవర్గాన్ని వదిలారని, ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది తమ నియోజకవర్గాలు కాదని రాజకీయ వ్యూహాల్లో భాగంగా వేరే నియోజవర్గం వెళ్లారని గుర్తు చేశారు. రాజకీయ విమర్శలు చేయొచ్చు గాని వ్యక్తిగత విమర్శలు చేయకూడదని, జగన్‌మోహన్ రెడ్డిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. బాలినేని శ్రీనివాసరెడ్డి విమర్శలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు.

అదానీ లాంటి సంపన్నుల కోసం పేదలపై భారాలు

- విద్యుత్తు ఒప్పందాల అవినీతిపై విచారణ జరిపించాలి
- పిపిఎస్ఎస్ , పలు సంఘాలు విద్యుత్ భవన్ ఎదుట ధర్నా



విద్యుత్ భవన్ ఎదుట ఆందోళన చేస్తున్న పిపిఎస్ఎస్, పలు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అదానీ లాంటి సంపన్నుల కోసం పేద మధ్యతరగతి కుటుంబాలపై ట్రూఅప్ విద్యుత్తు ఛార్జీల పేరుతో భారాలు మోపడం సరికాదని పట్టణ పౌర సంక్షేమ సంఘం (పిపిఎస్ఎస్) రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ పుల్లారెడ్డి అన్నారు. కర్నూలు విద్యుత్తు భవన్ ముందు పిపిఎస్ఎస్, పేదకాలనీల అసోసియేషన్ల ఆధ్వర్యంలో ట్రూఅప్ ఛార్జీల భారాలను నిరసిస్తూ సోమవారం ధర్నా చేశారు. విద్యుత్ ఒప్పందాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని, ట్రూఅఫ్ ఛార్జీలు రద్దు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పిపిఎస్ఎస్ నాయకులు ఎం నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో పెట్రోల్ బంకుల యజమానుల సంఘం జిల్లా అధ్యక్షులు జె సురేష్, బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ రాష్ట్ర అధ్యక్షులు ఎం యాకోబ్, నివాస ప్రాంతాల అసోసియేషన్ ప్రతినిధి ఎస్ అన్వర్ బాషతో కలిసి పుల్లారెడ్డి మాట్లాడారు. గత నెల ప్రకటించిన రూ.6000 కోట్లతో సహా రూ.11,820 కోట్ల ట్రూఆప్ ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదానీలాంటి సంపన్నుల ఆదాయం కోసం, కమీషన్లకు కక్కుర్తిపడి పేద మధ్యతరగతి ప్రజలు, సూక్ష్మ, చిన్న పరిశ్రమల సంస్థలపై అవినీతి పాలకుల రూ.వేలకోట్లు ట్రూఆప్‌చార్జీల భారం వేస్తారా అని ప్రశ్నించారు. విద్యుత్తు ఒప్పందాల్లో జరిగిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపి ప్రజా ధనాన్ని కాపాడాలని కోరారు. ఈ అవినీతి గురించి ఇతర దేశాలు చెప్పేంత వరకు మన పాలకులకు నిఘా సంస్థలకు తెలియకపోవడం బాధాకరమని అన్నారు. ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేసి టిడిపి కూటమి ప్రభుత్వం మాటపై నిలవాలని కోరారు. విద్యుత్ భవన్ కార్యాలయం లోపలికి వెళ్లేందుకు అవకాశం లేకుండా గేటుకు తాళం వేయడంతో అధికారులపై ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్, పెట్రోల్ బంకుల యజమానుల సంఘం, రైస్ మిల్లుల యజమానుల సంఘం, మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్, చిన్న వ్యాపారులు, అనేక కాలనీల అసోసియేషన్ల కమిటీలు, పిపిఎస్ఎస్ నాయకులతో కలిసి విద్యుత్ శాఖ డిప్యూటీ ఇంజనీర్ ఓబులేష్‌కు వినతి పత్రాలు ఇచ్చారు. ఎపి విద్యుత్ నియంత్రణ మండలికి వినతి పత్రాలు పంపిస్తామని డిఇ హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో నాయకులు ఖలీల్ అహ్మద్, శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర, తిరుపతయ్య, షబ్బీర్, మహమ్మద్‌యూనుస్, సివివర్మ తదితరులు పాల్గొన్నారు.

సిఎన్‌జి ధరల మంట

- కిలోపై రూ.2 పెంపు
- బిజెపి ఎన్నికల రిటర్న్ గిఫ్ట్



న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కార్ ఎప్పటి తరహాలోనే ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజలకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది. పర్యావరణ అనుకూల ఇంధనం సిఎన్‌జిపై కేంద్రం భారీగా ధరలు పెంచుతూ సోమవారం నిర్ణయం తీసుకుంది. సాధారణంగా పెట్రోల్, డీజల్ ధరలతోనే ప్రజలకు షాకు ఇచ్చే బిజెపి సర్కార్ ఈ దఫా సిఎన్‌జి ధరలను పెంచడం విశేషం. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు ముగిసినయే లేదో సిఎన్‌జిపై ఉన్నట్టుండి కిలోకు రూ.2 పెంచింది. ఈ ప్రకటన వెలుపడగానే ముంబయితో పాటు నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్ వంటి ప్రాంతాల్లో సిఎన్‌జి ధరలు పెరిగాయి. మహారాష్ట్ర, జార్ఖండ్‌లో ఎన్నికల నేపథ్యంలో ధరలు పెంచకుండా ఇంతకాల వేచి చూసింది. కాగా.. త్వరలో ఢిల్లీలోనూ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఆ రాష్ట్రంలో ధరల పెంపును మినహాయించింది. పెంచిన ధరలతో ముంబయిలో కిలో సిఎన్‌జి ధర రూ.77కు చేరింది. నోయిడా, ఘజియాబాద్‌లలో వరుసగా రూ.81.70, రూ.82.12గా ఉండనుంది. కాగా.. ఢిల్లీలో కిలో సిఎన్‌జి ధర యథాతథంగా రూ.75.09గా కొనసాగనుంది.

ముంబయిలోని సిటీ గ్యాస్ రిటైలర్ మహానగర్ గ్యాస్ లిమిటెడ్ సిఎన్‌జి ధరలను కిలోపై రూ. 2 చొప్పున పెంచినట్లు ప్రకటించింది. గత రెండు నెలలుగా ధరలను పెంచని అదానీ టోటల్ గ్యాస్ కూడా సిఎన్‌జి రేటును పెంచేసింది. ఇతర గ్యాస్ సరఫరా సంస్థలు కూడా ధరల పెంపును ప్రకటించనున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో కిలో ధర రూ. 96గా ఉంది. దేశం మొత్తం మీద హైదరాబాద్‌లోనే సిన్‌జి రేటు చాలా ఎక్కువగా ఉందని స్పష్టమవుతోంది. ఢిల్లీ ఎన్నికల తర్వాత మరోమారు ధరల వడ్డింపు ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం సిఎన్‌జిపై 14 శాతం ఎక్సైజ్ సుంకం అమల్లో ఉంది. దీన్ని తగ్గించినట్లయితే, రిటైలర్లు పెరిగిన ధరను వినియోగదారులకు బదిలీ చేయాల్సిన అవసరం లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ముంబయి, ఢిల్లీతో పాటు పలు నగరాల్లో సిఎన్‌జిపై ఆధారపడి అధికంగా వాహనాలు నడుస్తున్నాయి. ఇప్పటికిప్పుడు ఢిల్లీలోనూ ధరలు పెంచితే ఓటర్లపై ప్రభావం పడొచ్చని.. బిజెపిపై వ్యతిరేకత పెరిగితే.. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో నష్టం జరగొచ్చనే ఉద్దేశ్యంతో అక్కడ సిఎన్‌జి ధరల పెంపును తాత్కాలికంగా వాయిదా వేసి ఉండొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల తర్వాత అక్కడ కూడా సిఎన్‌జిపై ధరల వడ్డింపు ఉండొచ్చని అంటున్నారు.

శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యిపై దర్యాప్తు ముమ్మరం

- త్వరలో సిబిఐ డైరెక్టర్‌కు నివేదిక



తిరుపతి భూదేవి గెస్ట్‌హౌస్‌లోని 'సిట్' కార్యాలయం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదంపై దర్యాప్తును స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) ముమ్మరం చేసింది. చెన్నైలోని దిండిగల్‌లోని ఎఆర్ డెయిరీలో ఆదివారం విచారణ చేపట్టింది. సోమవారం తిరుపతి భూదేవి గెస్ట్‌హౌస్‌కు చేరుకుని ఫైళ్లను సిట్ బృందం సభ్యులు పరిశీలించారు. రెండు నెలల క్రితం శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదంపై పెద్ద ఎత్తున దుమారం రేగడంతో నిజనిజాలను నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు డిఐజిలు సర్వశ్రేష్ట త్రిపాఠి, గోపీనాథ్‌జెట్టి, నలుగురు డిఎస్‌పిలు, ఇద్దరు సిఐలతో సిట్‌ను ఏర్పాటు చేసింది. వైసిపి నేత, టిటిడి మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి... సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించకూడదని, ఆధారాలు లేకుండా మాట్లాడడం సరైంది కాదని రాష్ట్ర ప్రభుత్వంపై ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ..సిట్ దర్యాప్తుకు తాత్కాలికంగా నిలిపివేస్తూ తీర్పు చెప్పిన విషయం విదితమే.

ఈ సంఘటనపై స్వతంత్ర దర్యాప్తుతో పాటు సిబిఐకి అప్పగించింది. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణ కొనసాగించాలని సిట్‌ను సిబిఐ ఆదేశించింది. సిట్ డిఎస్‌పిలు సీతారామ ఆంజనేయులు, శివనారాయణస్వామి, కృష్ణమోహన్, వెంకటరామయ్య విచారణ చేపడుతున్నారు. త్వరలోనే నివేదికను సిబిఐ డైరెక్టర్ వీరేష్ ప్రభుకు అందజేయనున్నారు.

వర్మ కోసం పోలీసుల గాలింపు

- రెండోసారి విచారణకు ఆర్‌జివి డుమ్మా..
- జిల్లా నుంచి వెళ్లిన ప్రత్యేక బృందాలు..

ప్రజాశక్తి-మద్దిపాడు (ప్రకాశం జిల్లా)

సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టిన కేసులో ఒంగోలు టూటౌన్ సిఐ ముందు విచారణ నిమిత్తం హాజరుకావాల్సిన ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ (ఆర్‌జివి) రెండోసారీ డుమ్మా కొట్టారు. దీంతో ఆయనను అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. వర్మ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా నుండి ప్రత్యేక బృందాలు హైదరాబాద్, కోయంబత్తూర్‌కు వెళ్లాయి. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, నారా లోకేష్ వ్యక్తిత్వాలను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారంటూ ఈ నెల 10న రామ్‌గోపాల్‌వర్మపై మద్దిపాడు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదయింది. ఈ కేసులో బెయిల్ కోసం వర్మ హైకోర్టును ఆశ్రయించగా ఆయనకు చుక్కెదురైంది. అరెస్టు నుంచి రక్షణ కల్పించలేమని న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఈ నెల 19న ఆర్‌జివి విచారణకు హాజరు కావాల్సి ఉండగా తనకు వారం రోజులు సమయం కావాలంటూ వర్మ తరపు లాయర్ ఒంగోలులోని రూరల్ సిఐ శ్రీకాంత్‌ని కలిసి విన్నవించారు. 25న విచారణకు హాజరు కావాలంటూ మరోసారి పోలీసులు నోటీసులు పంపించారు. గడువు ముగిసినా విచారణకు హాజరు కాకపోవడంతో అరెస్టు చేసేందుకు జిల్లా నుండి ప్రత్యేక పోలీసు బృందాలు హైదరాబాద్‌కు వెళ్లాయి. ఆర్‌జివి ఫోన్‌కు కూడా అందుబాటులో లేరు. రామ్‌గోపాల్‌వర్మ షూటింగ్ నిమిత్తం తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఉన్నారన్న సమాచారంతో ఒక ప్రత్యేక బృందాన్ని అక్కడికి పంపినట్లు రూరల్ సిఐ శ్రీకాంత్ తెలిపారు.

భారత జిడిపి అంచనాలకు ఎస్‌అండ్‌పి కోత



ముంబయి : భారత వృద్ధి రేటు ముందుగా అనుకున్న స్థాయిలో పెరగడం లేదని అంతర్జాతీయ రేటింగ్ ఎజెన్సీలు విశ్లేషణలు చేస్తున్నాయి. జిడిపి అంచనాలకు ఇటీవల ఇక్రా రేటింగ్స్, మోర్గాన్ స్టాన్లే కోత పెట్టగా.. అదే బాటలో తాజాగా గ్లోబల్ రేటింగ్ దిగ్గజం ఎస్‌అండ్‌పి ప్రకటన చేసింది. పట్టణ డిమాండ్ పడిపోవడం, హెచ్చు వడ్డీ రేట్లు, విత్త వ్యయాలు పెరగడంతో రాబోయే రెండు ఆర్థిక సంవత్సరాల్లో భారత జిడిపి తగ్గనుందని ఎస్‌అండ్‌పి సోమవారం ఓ రిపోర్ట్‌లో తెలిపింది. వచ్చే 2025-26లో భారత జిడిపి 6.7 శాతానికి, తర్వాత ఆర్థిక సంవత్సరంలో 6.8 శాతానికి పరిమితం కావొచ్చని విశ్లేషించింది. ఇతక్రితం ఈ అంచనా వరుసగా 6.9శాతం, 7 శాతంగా ఉంది. ప్రస్తుత 2024-25లో 6.8 శాతంగా ఉండొచ్చని ఎస్‌అండ్‌పి పేర్కొంది. "అధిక వడ్డీ రేట్లు, పట్టణ డిమాండ్ తగ్గడం, విత్త వ్యయాల్లోనూ క్షీణత, కొనుగోలు శక్తి పడిపోవడం తదితర కొన్ని ముఖ్యమైన సూచీలు ప్రతికూలతలో ఉన్నాయని.. సెప్టెంబర్ త్రైమాసికంలో నిర్మాణం రంగం వృద్ధి కూడా స్తబ్దుగా ఉంది. ఈ పరిణామాలు జిడిపి పెరుగుదల తొలుత అంచనాలకు ప్రధాన ప్రతిబంధకంగా ఉన్నాయి." అని ఎస్‌అండ్‌పి విశ్లేషించింది. ప్రస్తుత ఏడాదిలో చైనా జిడిపి 4.8 శాతంగా, వచ్చే ఏడాది 4.1 శాతంగా, 2026లో 3.8 శాతం చొప్పున ఉండొచ్చని తెలిపింది. అమెరికా టారీఫ్‌ల పెంపు ప్రతిపాదనలు చైనాకు ప్రధాన సవాల్‌గా నిలువొచ్చని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) 6.5 శాతానికి పరిమితం కావొచ్చని రేటింగ్ ఎజెన్సీ ఇక్రా బుధవారం ఓ రిపోర్ట్‌లో విశ్లేషించింది. ఇంతకు రెండు రోజుల క్రితం మోర్గాన్ స్టాన్లే కూడా జిడిపి అంచనాలకు ఏడు శాతం నుంచి ఏకంగా 6.3 శాతానికి కోత పెట్టింది. ఏడాది భారీ వర్షాలు, బలహీనమైన కార్పొరేట్ కంపెనీల పనితీరు, సరుకుల ఎగుమతుల్లో పతనం. పడిపోతున్న వ్యక్తిగత రుణాల వల్ల డిమాండ్ పడిపోవచ్చని ఇక్రా పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో దేశ వృద్ధి 6.3 శాతానికే పరిమితం కావొచ్చని మోర్గాన్ స్టాన్లే పేర్కొంది. 2024-25లో భారత జిడిపి 6.7 శాతానికి పరిమితం కావొచ్చని విశ్లేషించింది. ఇంతక్రితం 7 శాతంగా అంచనా వేసింది. ద్వితీయార్థంలో 6.7-6.8 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చని పేర్కొంది. వచ్చే 2026-27లోనూ భారత జిడిపి 6.5 శాతంగా ఉండొచ్చని మోర్గాన్ స్టాన్లే గ్రూప్ రీసెర్చ్ ఇండియా చీఫ్ ఎకనామిస్ట్ ఉపాసన చద్రా పేర్కొన్నారు.

మారుతి సుజుకి 30 లక్షల యూనిట్ల ఎగుమతి

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి ఇప్పటి వరకు భారత్ నుంచి 30 లక్షల యూనిట్లను ఎగుమతి చేసినట్లు తెలిపింది. నాలుగు దశాబ్దాల్లో ఈ మైలురాయిని సాధించినట్లు పేర్కొంది. 2024-25 ఏప్రిల్ నుంచి అక్టోబర్ మాసాల్లో 1,81,444 యూనిట్లను సరఫరా చేసినట్లు వెల్లడించింది. గతేడాది ఇదే కాలం నాటితో పోల్చితే 17.4 శాతం వృద్ధి ఉందని పేర్కొంది. ప్రస్తుతం తమ కంపెనీ 100 దేశాలకు 17 మోడళ్లను ఎగుమతి చేస్తున్నట్లు తెలిపింది. 2030-31 నాటికి ఏడాదికి 7.5 లక్షల యూనిట్లను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మారుతి సుజుకి ఇండియా ఎండి, సిఇఒ హిసషి టకెసి తెలిపారు.

మళ్లీ 80వేల మార్క్ దాటిన సెన్సెక్స్

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం కూడా భారీ లాభాలను నమోదు చేసింది. మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి గెలవడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో వరుసగా రెండో రోజూ లాభపడటంతో సెన్సెక్స్ మళ్లీ 80వేల ఎగువన నమోదయ్యింది. ఇంట్రాడేలో 1300 పాయింట్లకు పైగా లాభపడి 80,473 గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. తుదకు 993 పాయింట్ల లాభంతో 80,110 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 314.65 పాయింట్ల లాభంతో 24,222కు చేరింది. సెన్సెక్స్ 30లో ఎల్అండ్‌టి, ఎస్‌బిఐ, అదానీ పోర్ట్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. జెఎస్‌డబ్ల్యూ స్టీల్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ షేర్లు అధికంగా నష్టపోయాయి.

సంపాదకీయం


హెచ్చరిక.. మార్గదర్శనం..

మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అధికార కూటములు గెలుపొందాయి. మహారాష్ట్రలో బిజెపి, ఏక్‌నాథ్ షిండేకు చెందిన శివసేన, అజిత్ పవార్‌కు సంబంధించిన ఎన్‌సిపి మహాయుతి ఫ్రంట్ సాధించిన అనూహ్య విజయం ఆశ్చర్యపరుస్తుంది. 288 స్థానాలున్న మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన సాధారణ మెజార్టీ 145 స్థానాలు కాగా మహాయుతికి 234 స్థానాలొచ్చాయి. కాంగ్రెస్, ఉద్ధవ్ థాకరేకు చెందిన శివసేన, శరద్ పవార్‌కు సంబంధించిన ఎన్‌సిపి ఫ్రంట్ మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ)కి 48 సీట్లే దక్కాయి. అంచనాలకు మించి ఓట్లు, సీట్లు రావడానికి బిజెపి సహజసిద్ధంగా ప్రయోగించిన హిందుత్వ కార్డు, అస్తిత్వ రాజకీయాలు ప్రధాన కారణం. కుల, మత, ప్రాంతీయ భావాలను తనకు అనుకూలంగా మరల్చుకోవడంలో, ఓట్లను సమీకరించడంలో సక్సెస్ అయిందని ఎన్నికల ఫలితాలను చూస్తే అర్థమవుతుంది. మరాఠా కోటాను తానే తెరమీదకు తెచ్చి, నిరసనగా ఆందోళనలు చేస్తున్న తరగతులను సైతం తన వైపు తిప్పుకుంది. ఉచిత పథకాలొద్దని విపక్షాలకు సుద్దులు వల్లించే బిజెపి, అధికారం కోసం పలు సంక్షేమ పథకాలను ప్రకటించింది.

గిరిజన రాష్ట్రం జార్ఖండ్‌లో జెఎంఎం నేతృత్వంలోని కూటమి ఘన విజయం బిజెపికి మింగుడు పడని వ్యవహారం. రాష్ట్రంలో 81 స్థానాలకుగాను జెఎంఎం ఫ్రంట్ 56 సీట్లు గెలుపొందింది. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎకి కేవలం 24 సీట్లొచ్చాయి. అవినీతి ఆరోపణల కేసులో జెఎంఎం చీఫ్, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కేంద్ర బిజెపి సర్కార్ జైలులో పెట్టించింది. సార్వత్రిక ఎన్నికలకు బయటికి రానీయలేదు. బెయిల్ రాకుండా అడ్డుకుంది. సుప్రీం కోర్టు ఆదేశాలతో మాత్రమే హేమంత్‌కు బెయిల్ లభించింది. హేమంత్ జైలులో ఉండగా కొన్నాళ్లు సిఎంగా పని చేసిన ఆయన సోదరుడు చెంపయి సోరెన్‌ను బిజెపి తమలో చేర్చుకున్నా, ప్రధాని మోడీ, ఇతర బిజెపి పెద్దలు హేమంత్ అవినీతి పరుడంటూ పెడబొబ్బలు పెట్టినా, మత విద్వేషాలు, ఎస్‌టి, నాన్-ఎస్‌టి విద్వేషాలు రెచ్చగొట్టినా ఆ కుట్రలను పటాపంచలు చేసి జెఎంఎం ఫ్రంట్‌కు ప్రజలు ఘన విజయం అందించారు. హేమంత్‌పై బిజెపి చర్యలన్నీ రాజకీయ కక్షతో కూడుకున్నవని గ్రహించి జెఎంఎం ఫ్రంట్‌కు రెండోసారి పట్టం కట్టి తమ విశ్వాసాన్ని చాటుకున్నారు. హేమంత్ సారథ్యంలోని ప్రభుత్వమే తమ హక్కులను పరిరక్షిస్తుందని ఆదివాసీలు, ఇతరులు సైతం నమ్మారు. జెఎంఎం కూటమి విజయానికి అది ప్రకటించిన, ఇంతకు ముందు అమలు చేసిన సంక్షేమ పథకాలూ కారణమే.

మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు పలు హెచ్చరికలతో పాటు మార్గదర్శనమూ కావిస్తున్నాయి. ప్రపంచ ద్రవ్య పెట్టుబడికి, నయా-ఉదారవాద విధానాలకు దేశానికి మహారాష్ట్ర ముఖద్వారం. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయం నాగ్‌పూర్ ఈ రాష్ట్రంలోనిదే. అందుకే మహారాష్ట్ర చేజారి పోకుండా ఎన్నికల ప్రకటనలో జాప్యం సహా అన్ని పాచికలనూ బిజెపి వాడింది. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించిన విపక్ష ఎంవిఎ చివరి వరకు ఓవర్ కాన్ఫిడెన్స్‌లో ఉంది. సీట్ల సర్దుబాట్లలో అసంతృప్తులు, పార్టీల ఆధిపత్య ధోరణి ఎంవిఎను ఘోరంగా దెబ్బతీసింది. జార్ఖండ్‌లో బిజెపి కుయుక్తులను జెఎంఎం కూటమి సమర్ధవంతంగా ఎదుర్కొని విజయ తీరాలు చేరింది. మహారాష్ట్రలో మోడీ చరిష్మా పని చేసిందని ఊరేగుతున్న బిజెపికి జార్ఖండ్‌లో అదేమైందో విశదీకరిస్తే బాగుంటుంది. అటవీ రాష్ట్రమైన జార్ఖండ్‌లో సహజ వనరులను అదానీ, ఇతర కార్పొరేట్లకు ధారాదత్తం చేయాలన్న బిజెపి పన్నాగం పారలేదు. వయనాడ్‌లో ప్రియాంక గెలుపు ఊహించినదే. దేశ వ్యాప్తంగా ఉప ఎన్నికలు జరిగిన 46 అసెంబ్లీ స్థానాల్లో అత్యధికంగా అధికార కూటములు, పార్టీలు నెగ్గాయి. మహారాష్ట్రలో దహాను స్థానంలో సిపిఎం జయకేతనం వామపక్ష, ఆదివాసీ హక్కుల, కార్మిక, ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తినిస్తుంది. సార్వత్రిక ఎన్నికల్లో స్వంతంగా మెజార్టీ కోల్పోయి కేంద్రంలో సంకీర్ణ సర్కారు నడుపుతున్న బిజెపికి హర్యానా, మహారాష్ట్ర గెలుపులు ఊతమిస్తున్నాయి. మతతత్వ-కార్పొరేట్ విధానాలను మరింత ముందుకు తీసికెళ్లేందుకు బిజెపి ప్రయత్నిస్తుంది. ప్రజలు అప్రమత్తతతో మెలగాలి.

మహనీయుల మాట



ఎదుటివారు నీ మాటలను శంకించినా నీ పనిని చూసి నమ్ముతారు. పనికి వున్న విలువ అది.
- గోర్కీ
ప్రసిద్ధ రష్యన్ రచయిత.

పెట్టుబడిదారులకు ద్రవ్య బదలాయింపులు



నయా ఉదారవాద వ్యవస్థలో ద్రవ్యలోటు జిడిపిలో ఒకానొక నిర్ణీత శాతానికి మించకుండా ఉండాలనే నిబంధన వర్తిస్తుంది. ప్రభుత్వాలు సాధారణంగా ఆ పరిమితికి లోబడే నడుచుకుంటాయి. అటువంటప్పుడు పెట్టుబడిదారులకు ద్రవ్యాన్ని బదలాయించడం అంటే ఇంకెక్కడో ప్రభుత్వం తన ఖర్చు తగ్గించుకోవలసి వస్తుంది. మామూలుగా ఇలా ఖర్చు తగ్గించుకోవలసి వచ్చినప్పుడు ఆ వేటు ప్రజా సంక్షేమ పద్దుల మీదే పడుతుంది. లేదా శ్రామిక ప్రజల నుండి అదనంగా పన్నుల రూపంలో రాబట్టవలసి వస్తుంది.



ప్రభాత్ పట్నాయక్

ఈ మధ్య ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు ధనాన్ని బదలాయించడం మామూలైపోయింది. కార్పొరేట్ పన్నులను తగ్గించడం ద్వారా గాని, నేరుగా కాని ధనాన్ని బదలాయిస్తున్నాయి. ఈ విధంగా చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపు తేవాలని భావిస్తున్నాయి ప్రభుత్వాలు. డొనాల్డ్ ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్న కాలంలో ఇదే ఉద్దేశ్యంతో కార్పొరేట్ పన్ను తగ్గించాడు. ఇక్కడ మోడీ ప్రభుత్వం కూడా అదే ఉద్దేశ్యంతో భారీగా పన్ను రాయితీలను కార్పొరేట్లకు కట్టబెడుతోంది. ఐతే ఆర్థిక శాస్త్రంలో కనీసపు అవగాహన ఉన్నవారికి కూడా ఈ మాదిరి బదలాయింపుల వలన నయా ఉదారవాద వ్యవస్థలో ఆశించిన దానికి పూర్తి భిన్నంగా ఫలితాలు వస్తాయని తెలుసు.

నయా ఉదారవాద వ్యవస్థలో ద్రవ్యలోటు జిడిపిలో ఒకానొక నిర్ణీత శాతానికి మించకుండా ఉండాలనే నిబంధన వర్తిస్తుంది. ప్రభుత్వాలు సాధారణంగా ఆ పరిమితికి లోబడే నడుచుకుంటాయి. అటువంటప్పుడు పెట్టుబడిదారులకు ద్రవ్యాన్ని బదలాయించడం అంటే ఇంకెక్కడో ప్రభుత్వం తన ఖర్చు తగ్గించు కోవలసి వస్తుంది. మామూలుగా ఇలా ఖర్చు తగ్గించుకోవలసి వచ్చినప్పుడు ఆ వేటు ప్రజా సంక్షేమ పద్దుల మీదే పడుతుంది. లేదా శ్రామిక ప్రజల నుండి అదనంగా పన్నుల రూపంలో రాబట్టవలసి వస్తుంది. పెట్టుబడిదారులకు రూ.100 బదలాయించడానికి కార్మికులకు ఇచ్చే సంక్షేమంలో రూ.100 కోత పెట్టారనుకుందాం. అప్పుడు ఆ మేరకు స్థూల డిమాండ్ తగ్గిపోతుంది. దాని పర్యవసానంగా ఉపాధి, ఉత్పత్తి కూడా తగ్గిపోతాయి. అంటే పెట్టుబడిదారులకు ధనాన్ని బదలాయించడం వలన ఆర్థిక వ్యవస్థ అదనంగా ఊపు అందుకునేది ఏమీ ఉండదు సరికదా, ఉన్న స్థాయి నుంచి ఇంకా ముడుచుకు పోతుంది. కార్మికుల మీద అదనపు పన్నుల భారాన్ని మోపినా ఇదే జరుగుతుంది. ఈ పరిణామం ఏ విధంగా జరుగుతుందో చూద్దాం.

ఈ ఏడాదిలో ఎంత పెట్టుబడులు పెట్టాలన్నది ఇంతకు ముందే తీసుకున్న నిర్ణయాల ఆధారంగా జరుగుతుంది. పరిశ్రమల కోసం పెట్టే పెట్టుబడులు కార్యరూపం ధరించడానికి, ప్రాజెక్టులు పూర్తి అవడానికి ఎక్కువ సమయం పడుతుంది. ప్రభుత్వ రంగంలోనైనా లేక ప్రైవేటు రంగంలోనైనా సరే ఇది వర్తిస్తుంది. ఇప్పుడు ఆ పెట్టుబడులు పెట్టే వేగాన్ని పెంచి ఆర్థిక వ్యవస్థకు అదనపు ఊపు తేవాలనుకుంటే ఈ ఏడాది తీసుకున్న నిర్ణయం అమలు కావడానికి వచ్చే ఏడాది వరకూ సమయం పడుతుంది. ఆ తర్వాతే ఆ ఊపు పెరుగుతుంది. అదనపు పెట్టుబడి పెట్టాలన్న నిర్ణయంతో బాటు ఇప్పుడు ఎంత మోతాదులో పెట్టుబడి పెడుతున్నారో అది కూడా యథాతథంగా అదే స్థాయిలో కొనసాగాలి. ఐతే, ఈ లోపు ఈ ఏడాదిలో ఉత్పత్తి వినిమయం అయ్యే స్థాయిలో మార్పు వస్తుంది. సాధారణంగా కార్మికులు తమకు లభించే ఆదాయంలో అత్యధిక శాతం వెంటనే ఖర్చు చేసేస్తారు. పెట్టుబడిదారులు అలా కాదు. ఇప్పుడు కార్మికుల సంక్షేమానికి కోత పెట్టో లేక వారి మీద అదనంగా పన్నులు పెంచో ఆ సొమ్మును పెట్టుబడిదారులకు బదలాయిస్తే అప్పుడు వినిమయం స్థాయి తగ్గిపోతుంది.

అంతే కాదు, పెట్టుబడిదారులు వినియోగించే సరుకులలో ఎక్కువ భాగం దిగుమతుల ద్వారా లభించేవే. వారికి అదనంగా ధనం బదలాయిస్తే అప్పుడు దిగుమతులు పెరుగుతాయి. వాటితో పోల్చినప్పుడు ఎగుమతుల నిష్పత్తి తగ్గిపోతుంది. ఐతే వాదన కోసం అలా జరగదని, పెట్టుబడిదారులకు అదనంగా ద్రవ్యం బదలాయించినా ఎగుమతి-దిగుమతి నిష్పత్తిలో ఏ మార్పూ ఉండదని అనుకుందాం.

దేశంలోని వినిమయం 'వి' అన్న అక్షరంతో సూచిద్దాం. అలాగే దేశంలో ఆ ఏడాది పెట్టిన పెట్టుబడిని 'పె' అన్న అక్షరంతోను, ప్రభుత్వ వ్యయాన్ని 'ప్ర' అన్న అక్షరంతోను, ఎగుమతుల విలువను 'ఎ' అన్న అక్షరంతోను, దిగుమతుల విలవను 'ది' అన్న అక్షరంతోను సూచిద్దాం. అప్పుడు దేశంలో మొత్తం స్థూల జాతీయ ఆదాయం ('ఆ' అనే అక్షరంతో సూచిద్దాం) లెక్కించాలంటే వినిమయం+పెట్టుబడి +ప్రభుత్వ వ్యయం+ (ఎగుమతుల విలువ-దిగుమతుల విలువ) అవుతుంది. దీనినే

ఆ = వి+పె+ప్ర+ (ఎ-ది) అని సూత్రంగా చెప్పవచ్చు.

ఇందులో 'వి' అన్నది (వినిమయం) తగ్గితే అప్పుడు 'ఆ' (స్థూల జాతీయ ఆదాయం) కూడా తగ్గిపోవడం అనివార్యంగా జరుగుతుంది. అది ఉత్పత్తిలో, ఉపాధిలో తగ్గుదల రూపంలో వ్యక్తం ఔతుంది.

ఇది జరిగిందంటే ఆర్థిక వ్యవస్థలో ఇప్పుడున్న పరిశ్రమల స్థాపక సామర్థ్యాన్ని వినియోగించే స్థాయి తగ్గిపోతుంది. ఉన్న సామర్థ్యాన్నే పూర్తిగా వినియోగించలేనప్పుడు అదనంగా పెట్టుబడులు పెట్టడానికి కూడా ఎవరూ ముందుకు రారు. ఆ విధంగా ఆర్థిక వ్యవస్థ ఊపందుకోడానికి బదులు ముడుచుకుపోతుంది.

ఐతే వ్యవహారం ఇక్కడితో ఆగిపోదు. ఆర్థిక వ్యవస్థ ముడుచుకు పోయినప్పుడు దాని ఫలితంగా లాభాలు తగ్గిపోతాయి. అంటే పెట్టుబడిదారులకు అదనంగా ద్రవ్యాన్ని బదిలీ చేయడం కోసం కార్మికుల కొనుగోలు శక్తికి కోత పెట్టడం వలన పెట్టుబడిదారులకు వచ్చే లాభాలు తగ్గిపోతాయి. పెట్టుబడిదారులకు అదనంగా బదలాయించిన ధనం ఎంత ఉంటుందో, దాదాపుగా అదే మోతాదులో వారి లాభాలు తగ్గిపోతాయి. అంటే నికరంగా వారి లాభాల స్థాయిలో ఏ మార్పూ ఉండదు.

మన దేశంలో ఆర్థిక స్థాయిలో అట్టడుగున ఉన్న 50 శాతం ప్రజానీకం దగ్గర దేశ సంపదలో కేవలం 2 శాతం మాత్రమే ఉంది. వారు తమ ఆదాయాల్లో పొదుపు చేయగలిగినదంటూ ఏమీ ఉండదు. ఆదాయాన్ని మొత్తం ఖర్చు చేస్తారు. ఆర్థిక వ్యవస్థలో పొదుపు చేసే సంపద అంతా పైస్థాయిలో ఉన్నవారి ద్వారానే జరుగుతుంది.

సంపన్నులు-అంటే పెట్టుబడిదారులు వారి ఆదాయాన్ని మొత్తం పొదుపు చేస్తారనుకుందాం. వారి ఆదాయం అంటే వారికి వచ్చిన లాభాల మొత్తమే కదా. ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా, మొత్తం దేశీయ పొదుపు లేదా పెట్టుబడిదారుల లాభం ఆ ఏడాది పెట్టిన ప్రైవేటు పెట్టుబడి+ ఆ ఏడాది ద్రవ్య లోటుతో (ఇందులో నుంచి విదేశీ పొదుపును తీసెయ్యాలి) సమానంగా ఉంటుంది.

ఆర్థిక వ్యవస్థలో వృద్ధి లేనప్పుడు ప్రైవేటు పెట్టుబడి పెరగదు. ద్రవ్య లోటును పెంచడానికి వీలు లేదు. విదేశీ పొదుపు కూడా ఆర్థిక వృద్ధి లేనప్పుడు పెరగదు. ఇవన్నీ స్థిరంగా ఉన్నప్పుడు పెట్టుబడిదారుల లాభాలు కూడా స్థిరంగానే ఉంటాయి తప్ప పెరగవు. అందుచేత పెట్టుబడి దారులకు బడ్జెట్ ద్వారా చేసే బదలాయింపులు పెట్టుబడిదారుల లాభాలను పెంచవు. ఆర్థిక వ్యవస్థ ఊపు అందుకోవడానికీ తోడ్పడవు. పైగా ఆర్థిక వ్యవస్థ మరింత మడుచుకు పోవడానికే దారి తీస్తాయి. మరి అటువంటప్పుడు ప్రభుత్వం ఎందుకు ఈ బదలాయింపులకు పూనుకుంటోంది? ఇప్పుడు తెలుసుకుందాం.

మొత్తం పెట్టుబడిదారుల లాభాలు ఏమీ మారవు అని తెలుసుకున్నాం. ఐతే, ఆ పెట్టుబడిదారుల్లో గుత్త పెట్టుబడిదారులకు అనుకూలంగా లాభాల పంపిణీ జరగడానికే ప్రభుత్వం ఈ బదలాయింపులకు పూనుకుంటోంది. కార్మికుల ఆదాయాలను తగ్గించడం ద్వారా ఈ బదలాయింపులు జరుగుతున్నాయి. దాని వలన కార్మికుల కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. ఆ కార్మికులు కొనుగోలు చేసే సరుకుల అమ్మకాలు తగ్గిపోతాయి. వాటిని ఉత్పత్తి చేసేవారిలో ఎక్కువ శాతం చిన్న, మధ్య స్థాయి పెట్టుబడిదారులు ఉంటారు. వారి లాభాలు బాగా తగ్గిపోతాయి. ఇంకోవైపు ప్రభుత్వం చేసే ద్రవ్య బదలాయింపుల్లో ఎక్కువ శాతం గుత్త పెట్టుబడిదారులు. బడా కార్పొరేట్లు దక్కించుకుంటారు. వాటిలో చిన్న, మధ్య స్థాయి పెట్టుబడిదారులకు దక్కేది చాలా తక్కువ. అంటే ఈ మొత్తం ప్రక్రియలో చిన్న, మధ్య స్థాయి పెట్టుబడిదారులు దెబ్బ తింటారు. గుత్త పెట్టుబడిదారులు, బడా కార్పొరేట్లు మరింత లాభపడతారు.

ఈ ప్రక్రియనే మార్క్స్ "పెట్టుబడి కేంద్రీకరణ" అని అన్నాడు. ఈ విధమైన బదలాయింపుల వలన గుత్త పెట్టుబడిదారులు మరింత బలపడతారే తప్ప దేశ ఆర్థిక వ్యవస్థకు అదనంగా ఏ ఊపూ లభించదు.

పెద్ద నోట్ల రద్దు చేసినప్పుడు, జిఎస్‌టి అమలు లోకి వచ్చినప్పుడు ఆ చర్యల ఫలితంగా చిన్న, మధ్య స్థాయి పెట్టుబడిదారులు బాగా దెబ్బ తిన్నారని ప్రతిపక్షాలు, మీడియాలో ప్రధాన భాగం విమర్శించాయి. ఆ చర్యల పర్యవసానాలను వారు గుర్తించినట్టు ఈ ద్రవ్య బదలాయింపుల పర్యవసానాన్ని గుర్తించడం లేదు.


(స్వేచ్ఛానుసరణ)

ధనిక దేశాల దురాశ X ప్రజల అవసరాలు

వ్యాఖ్య

వాతావరణ సంక్షోభం

ఇప్పుడు భూగోళం ఒక ప్రమాదపు అంచున ఉంది. ఇక వెనక్కు తీసుకోలేనంతగా వాతావరణ మార్పులు జరుగుతున్నాయి. ఇది ఇక ఒక్క ధనిక దేశాల సమస్య మాత్రమే కాదు. అయితే వారి దృష్టి అంతా ఇప్పుడు ఉక్రెయిన్‌లో రష్యాను ఏ విధంగా సైనికంగా ఓడించాలి, చైనాను ఆర్థికంగా ఎట్లా చుట్టుముట్టాలి అనేదే. పాలస్తీనాలో మానవ హననం జరిగినా సరే. చమురు సమృద్ధిగా వున్న పశ్చిమాసియాను లొంగదీసుకోవడానికి ఇజ్రాయిల్‌ను ప్రయోగించడం, మిగిలిన ప్రపంచంపై ఆధిపత్యం చలాయించడం ఎలా? అన్నదే వారి ఆసక్తి.





ప్రబీర్ పుర్కాయస్థ

(ఐక్యరాజ్యసమితి కాప్-29 సదస్సు అజర్‌బైజాన్‌లో (నవంబర్ 11-22) జరుగుతున్న సమయంలో రాసిన వ్యాసమిది)

ఈ వేసవి కాలంలో భూగోళమంతటా పెరిగిన తీవ్రమైన ఉష్ణోగ్రతలు, ఒక హెచ్చరికను జారీ చేస్తున్నాయి. వాతావరణ సదస్సు ఒప్పందాలను ఏమాత్రం ఒప్పుకోని డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఈ నేపథ్యంలో కాప్-29 సదస్సు జరిగింది.

గ్లోబల్ వార్మింగ్ అనేది, ఇంకేమాత్రమూ శీతల దేశాల శాస్త్రీయ చర్చలకో, ఎవరో కొందరు క్లైమెట్ శాస్త్రవేత్తల హెచ్చరికలకో పరిమితమైనది కాదు. ఆ ఫలితాలను ఇప్పుడు స్వయానా అనుభవిస్తున్నాం. ఉత్తర భారతం లోనే కాదు. యూరోప్‌లో కూడా ఉష్ణోగ్రత రికార్డులు బద్దలవుతున్నాయి. భూ ష్ణోగ్రతలను 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్ తగ్గించాలనే ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. సగటు ఉష్ణోగ్రతలను, 20 ఏళ్లకు లెక్కించి చెప్పాలనే సాంకేతిక కారణం పక్కన పెడితే, ఇప్పటికే 1.5 డిగ్రీల మార్కును దాటేశాము. వాతావరణ మార్పుల తీవ్రత వల్ల చాలా ప్రాంతాలు నివాసయోగం కాకుండా పోతున్నాయి. వాతావరణ విపరీతాల వల్ల దిగువ ప్రాంతాలే కాక, అన్ని ప్రాంతాలకూ తీవ్రమైన నష్టం జరుగుతోంది. చరిత్రలో ఒక లక్షా 25 వేల సంవత్సరాలకు ముందు మనుషులు ఇటువంటి పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఆఫ్రికాను వదిలి యురేషియాకు పోతున్న సందర్భం అది. ఇప్పుడు మళ్లీ ఈ వాతావరణ అస్థిరతలు ఎక్కడికి దారితీస్తాయో, అర్థం కాని పరిస్థితి ఉంది.

వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ అది వ్యవసాయం మీద, ప్రజల జీవనాధారాల మీద, ప్రభావం చూపుతాయి. పొలాల్లో, ఫ్యాక్టరీలలో పని చేసే వాళ్ల మీద, వేడి పరిస్థితిలో పని చేసే వాళ్ళందరి మీదా ఈ ప్రభావం ఉంటుంది. శీతాకాలంలో అసాధారణంగా పెరిగే ఉష్ణోగ్రతల వల్ల ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతాల్లో ఉండే మంచు కరిగి, సముద్రాల మట్టాలు వేగంగా పెరుగుతాయి.

ఈ గ్లోబల్ వార్మింగ్ అనేది ఆఫ్రికా-ఆసియా-లాటిన్ అమెరికాల సమస్యని గ్లోబల్ నార్త్ (అమెరికా-కెనడా-యూరోప్) అనుకుంటోంది. అయితే ఈ ధనిక దేశాల్లోని సంపన్నులతో సహా వాతావరణ మార్పులకు ఎవరూ అతీతులు కారు. వాతావరణ సంశయ వాదులున్న అమెరికాలోనే, 1980 తరువాత, నాలుగు వందల వాతావరణ ఉత్పాతాలు జరగడం వల్ల ఒక బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. వర్షాలు, వరదలు, కార్చిచ్చులు, విపరీతంగా పెరుగుతున్నాయి. ధ్రువ ప్రాంతాలలో ఉండే శాశ్వతమైన మంచు పొరలు కరగడం, పెద్ద ఎత్తున మిథేన్ విడుదల కావడం, సముద్రపు అలలపై ఎటువంటి ప్రభావం చూపుతుందో, ఏ పర్యవసనాలకు దారితీస్తుందో అర్థం కావడం లేదు.

గ్రీన్ హౌస్ వాయువులను తగ్గించేందుకు, కార్బన్ మార్కెట్లను పునరుద్ధరించే ఆశావహ దృష్టితో, కార్బన్ క్రెడిట్లపై ఒక ఏకాభిప్రాయ ప్రకటనతో కాప్ 29 ప్రారంభమైంది. హరిత వాయు వ్యూహాలకు అవసరమైన నిధుల సమీకరణకు చర్చ జరుగుతున్నప్పుడైతే, ఇటువంటి ప్రకటనలకు ప్రాధాన్యత ఉండేది. కానీ ఇప్పుడు పెద్ద ఉపయోగం లేదు. ఈ కార్బన్ క్రెడిట్ పథకాలన్నీ, కాగితాలకే పరిమితమైనాయి. పేద దేశాలకు (అడవులు ఉంటే), కొంత ఆర్థిక సహాయం అందొచ్చు. అంతేగానీ ఉద్గారాలు తగ్గడం అనుమానమే. ఉదాహరణకు వెర్రా అనే కంపెనీ కార్బన్ క్రెడిట్లను సర్టిఫై చేసే ప్రపంచంలోనే అతి పెద్ద కంపెనీ. కార్బన్ క్రెడిట్లలో 90 శాతం, ఈ కంపెనీనే అమ్మింది. తాను బాగా డబ్బు చేసుకుంది కానీ, ఉద్గారాలను తగ్గించింది ఏమీ లేదు.

అయితే ఉద్గారాలు తగ్గించేది ఎలా? మళ్లీ మొదటికే వస్తున్నాం. బొగ్గుకు, చమురుకు, సహజ వాయువులకూ బదులుగా గ్రీన్ ఎనర్జీని వాడటమే పరిష్కారం. సౌర, వాయు వనరుల ద్వారా కరెంటును ఉత్పత్తి చేసి, గ్రిడ్‌కు సరఫరా చేయడం, ఈమధ్య చాలా చౌకగా మారింది. కానీ, కారు లాంటి ఎలక్ట్రిక్ వాహనాలకు, పెట్రోల్ వాహనాలతో పోలిస్తే తక్కువ ఖర్చు వస్తోంది. బ్యాటరీ ధరలు తగ్గడం, కెపాసిటీ పెరగడం లాంటివి ఇందుకు కారణం. గ్రీన్ హౌస్ వాయువులు వెలువడే, స్టీలు, సిమెంటు, ఎరువుల ఉత్పత్తి పారిశ్రామిక ప్రక్రియలకు కూడా ప్రత్యామ్నాయలు కనుక్కోవాల్సి వుంది. అలాగే, సరుకుల దూర రవాణాలో కూడా, ఇంకా అనేక ఉద్గార సమస్యలు ఉన్నాయి

ఈ సంవత్సరం, పెద్ద మార్పులనే చూసింది. కర్బన ఉద్గారాలను అత్యధికంగా ఉత్పత్తి చేసే చైనా, 2030కు తగ్గించుకోవాల్సిన ఉద్గారాల లక్ష్యాలను, 2023-24కే సాధించింది. చైనా సౌర విద్యుత్తులో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోంది. మన దేశం కూడా పునరుత్పాదక ఇంధన రంగాన్ని, విస్తృతపరిచి, పెద్ద భవిష్యత్ ప్రణాళికలనే రచిస్తోంది.

గతంలో ఒక సమస్య ఉండేది. పునరుత్పత్తి విద్యుత్తు ఉత్పత్తిలో ఉండే హెచ్చుతగ్గులకు, రోజువారీ విద్యుత్ స్థిర అవసరాలకు పొసగదు అనేది ఆ సమస్య. అయితే జల విద్యుత్ నిల్వ విధానాల ద్వారా దీన్ని అధిగమించవచ్చు. గ్రిడ్ స్థాయిలో బ్యాటరీలలో నిల్వ ఉంచడం అనే ప్రతిపాదన ఉన్నా, అది అధిక ఖర్చులతో కూడుకున్నది. దాని నిల్వ సామర్థ్యం కూడా తక్కువే. వామపక్ష ప్రభుత్వం ఆధ్వర్యంలో బెంగాల్ పురూలియాలో నిర్మించబడిన జల విద్యుత్ నిల్వ ప్రాజెక్టు మొదటిది. బహుళార్థ సాధక హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులలో ఉన్నట్టుగా, నీటి నిల్వ కోసం విస్తారమైన భూములను వాడాల్సిన అవసరం ఇందులో ఉండదు.

సౌర విద్యుత్ ప్రపంచంలోనే ఒక కీలకమైన ప్రత్యామ్నాయ శక్తిగా మారుతోంది. ఈ విషయంలో చైనా వేగం ఆశ్చర్యం కలిగించదు గాని, మిగిలిన దేశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. న్యూయార్క్ టైమ్స్ (సెప్టెంబర్ 2024) కథనం ప్రకారం చైనా 425 జి.డబ్ల్యు సౌరశక్తిని కొత్తగా ఉత్పత్తి చేస్తే, మిగిలిన ప్రపంచమంతా అమెరికా (33 జి.డబ్ల్యు) సహా 162 జి.డబ్ల్యు సౌర శక్తిని మాత్రమే ఉత్పత్తి చేశాయి.

భారతదేశం, 2030 నాటికి 500 జి.డబ్ల్యు పునరుత్పాదక విద్యుత్తును లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 80 శాతం సౌర విద్యుత్తే. ఇది సాధ్యమే. కానీ ఒక్క సౌర విద్యుత్ మీదే కాక, సౌర విద్యుత్ సరఫరా గొలుసుల శక్తిసామర్థ్యాలను పెంపొందించడానికి కూడా మదుపు చేయాలి. అంటే, సోలార్ ప్యానళ్లు, సోలార్ ప్లాంట్లు మాత్రమే కాక, సిలికాన్ వేఫర్స్, సోలార్ సెల్స్ లాంటి వాటి ఉత్పత్తి మీద శ్రద్ధ పెట్టాలి.

విద్యుత్ రంగం, దాని తర్వాత రవాణా రంగం నుంచి పెద్ద ఎత్తున గ్రీన్ హౌస్ వాయువులు వెలువడతాయనేది నిజమే. ఎలక్ట్రిక్ వాహనాలు (బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు-బి.ఇ.వి) ఈరోజు వ్యక్తిగత రవాణాలో ముందు స్థానంలో ఉన్నాయి. వీటి వాడకం వల్ల పెట్రోలు, డీజిల్ ద్వారా వచ్చే గ్రీన్ హౌస్ వాయువులు తగ్గుతాయి. ఈ బ్యాటరీ టెక్నాలజీలలో చైనా గ్లోబల్ లీడర్‌గా ఉంది. కాంటెంపరరీ ఆంపెరెక్స్ టెక్నాలజీ కో. లిమిటెడ్ (సి.ఎ.టి.ఎల్) కంపెనీ టెస్లాకే బ్యాటరీలు సరఫరా చేస్తున్నది. సి.ఎ.టి.ఎల్, బి.వై.డి లాంటి చైనా కంపెనీలు బ్యాటరీ ఉత్పత్తిలో ప్రపంచంలో ముందు స్థానంలో ఉండటమే కాకుండా ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్లో కూడా ప్రవేశిస్తున్నాయి. బి.వై.డి ఒక ప్రధానమైన కార్ల ఉత్పత్తిదారుగా తయారైంది. సి.ఎ.టి.ఎల్ ఇతరులతో భాగస్వామ్యం ఉండటమే కాకుండా, చైనాలో గ్రిడ్ స్టోరేజీలకు కూడా ఒక ప్రధాన సరఫరాదారుగా ఉంటున్నది.

ఇండియాలో కూడా అమర్ రాజా లాంటి స్వదేశీ బ్యాటరీ సరఫరాదార్లు ఉన్నారు. ఇండియన్ కార్ల ఉత్పత్తిదారులు కూడా ఎలక్ట్రిక్ వాహనాల రంగంలోకి ప్రవేశిస్తున్నారు. అమెరికా ఇక్కడ కూడా వెనుకే. ఒక ఎలక్ట్రిక్ వాహనం ధరలో 50 శాతం బ్యాటరీలకే ఖర్చవుతుంది. కానీ ఎలన్ మస్క్ చేస్తున్న మాయలో పడి అమెరికా బ్యాటరీ రంగాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. టెస్లాకు పైస్థాయి ధనికుల మార్కెట్ కావాలి. మాస్ మార్కెట్ కాదు. కాబట్టి చైనాను పోటీదారుగా భావించదు.

చైనా బ్యాటరీ ఉత్పత్తిదారులు, యూరోప్ మార్కెట్లోకి, అక్కడి కార్ల ఉత్పత్తిదారులతో జత కలిసి, చొచ్చుకుపోతున్నారు. ధర నాణ్యతల విషయంలో చైనాకు సమ ఉజ్జీలు కాలేకున్నా, అమెరికా, యూరోప్‌లు టారిఫ్ అడ్డంకులు పెడుతున్నాయి. ఒక విధంగా క్లైమేట్ లక్ష్యాలను బలి పెడుతున్నాయి.

పునరుత్పాదక ఇంధనాలను విస్తరణ, సరఫరా లేదా ఇతర పరిశ్రమలలో వాటి వినియోగంలో వస్తున్న వాస్తవ సమస్యలు, కాప్ 29కు పట్టవు. కార్బన్ ఈక్విటీ గురించి తర్వాత మాట్లాడుకోవచ్చు కానీ, కనీసం ధనిక దేశాలు పర్యావరణానికి చేసిన నష్టాలకు కొంతయినా బాధ్యత వహించాలి. భవిష్యత్తుకు బాధ్యత తీసుకోవాలి. అరకొర నిధులు ఇచ్చి చేతులు కడుక్కుంటామంటే కుదరదు.

ఇప్పుడు భూగోళం ఒక ప్రమాదపు అంచున ఉంది. ఇక వెనక్కు తీసుకోలేనంతగా వాతావరణ మార్పులు జరుగుతున్నాయి. ఇది ఇక ఒక్క ధనిక దేశాల సమస్య మాత్రమే కాదు. అయితే వారి దృష్టి అంతా ఇప్పుడు ఉక్రెయిన్‌లో రష్యాను ఏ విధంగా సైనికంగా ఓడించాలి, చైనాను ఆర్థికంగా ఎట్లా చుట్టుముట్టాలి అనేదే. పాలస్తీనాలో మానవ హననం జరిగినా సరే. చమురు సమృద్ధిగా వున్న పశ్చిమాసియాను లొంగదీసుకోవడానికి ఇజ్రాయిల్‌ను ప్రయోగించడం, మిగిలిన ప్రపంచంపై ఆధిపత్యం చలాయించడం ఎలా? అన్నదే వారి ఆసక్తి.

ఇదే వారి సూత్ర బద్ధత (రూల్ బేస్డ్ ఆర్డర్). జి7 దేశాలు, ప్రకృతి నియమాలకే కాదు. ఇతర దేశాలకు కూడా వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయి. తమ పెత్తనాన్ని నిలుపుకోవడానికి గుప్పెడన్ని ధనిక దేశాలు అందరి భవిష్యత్తును ఫణంగా పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒక మెరుగైన ప్రపంచాన్ని ఏ విధంగా నిర్మించుకోవాలనేది పెద్ద సవాలు.

(స్వేచ్ఛానుసరణ)

ప్రధాని విశాఖ పర్యటన వాయిదా

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

భారత ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటన వాయిదా పడింది. ఆయన ఈ నెల 29న విశాఖకు వచ్చి ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొనాల్సి ఉంది. టైకూన్ జంక్షన్ నుంచి ఎస్‌పి బంగ్లా రహదారి వరకూ రోడ్ షో నిర్వహించాల్సి ఉంది. పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, పూర్తయిన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు చేయాల్సి ఉంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాతావరణ శాఖ సూచనల మేరకు మోడీ పర్యటన వాయిదా పడినట్లు తెలుస్తోంది. త్వరలోనే మరో తేదీని ప్రకటిస్తారు. ఈ మేరకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు సమాచారం వచ్చింది.

బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం

- 29వరకు రాష్ట్రంలో వర్షాలు
- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న 24 గంటల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది వాయువ్యదిశగా తమిళనాడు-శ్రీలంక తీరాల వైపు వెళ్లే అవకాశం ఉందన్నారు. వాయుగుండం ప్రభావంతో ఈనె 29 వరకు దక్షిణ కోస్తా, రాయలసీమలో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, దక్షిణ కోస్తాలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని సూచించారు. దక్షిణ కోస్తా తీరం వెంబడి మంగళవారం గంటకు 50-70 కిలో మీటర్లు, బుధవారం 55-70 కిలో మీటర్లు వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపారు. వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని రోణంకి కూర్మనాథ్ సూచించారు.

వర్షాలు ఇలా...

ఈనెల 26,27,28 తేదీల్లో న నెల్లూరు, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం,పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్టణం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం. 29న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు విశాఖపట్టణం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం.

విద్యాసంస్థల్లో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయాలి :

హైకోర్టులో పిల్

ప్రజాశక్తి, అమరావతి

అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు/కాలేజీల్లో అగ్నిమాపక పరికరాలను ఏర్పాటుకు వీలుగా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కీతినీడి అఖిల శ్రీ గురు తేజ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం బోధనా, బోధనేతర సిబ్బంది వివరాలను పోలీస్ వెరిఫికేషన్ చేయించాలనే పిల్‌లో కోరారు. అన్ని విదాయ సంస్థల్లో అగ్నిమాపక యంత్రాలను ఏర్పాటు చేయాలి 2004లో సుప్రీంకోర్టు రాష్ట్రాలను ఆదేశించింది. సిబ్బంది వెరిఫికేషన్ చేయాలని కూడా పిల్‌లో తెలిపారు. ఈ ఆదేశాలు కూడా అమలు కావడం లేదనే పిల్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ, హోంశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు, డీజీపీ, ఉన్నత విద్యా మండలి చైర్మన్, విపత్తు నిర్వహణ డీజీ తదితరులను ప్రతివాదులుగా చేర్చారు.

నైతిక విలువలు పెంచండి : చాగంటికి సిఎం సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారతీయ కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని నేటి తరానికి తెలియజేయాలని, నైతిక విలువలను పెంపొందించేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సోమవారం సిఎంను కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ యువతలో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని చాగంటికి సూచించారు. మహిళలను గౌరవించడం, పెద్దలు, తల్లిదండ్రుల మాటలకు విలువ ఇవ్వడం వంటివి యువతకు నేర్పించాలని చెప్పారు. సుమతి, వేమన శతకాలు, నీతి కథల ద్వారా విద్యార్థులు, యువతలో విలువలు పెంచేందుకు ప్రయత్నిస్తానని, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తో చర్చించానని చాగంటి కోటేశ్వరరావు సిఎంకు తెలిపారు. అనంతరం కోటేశ్వరరావును సిఎం శాలువాతో సత్కరించి, వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేశారు.

శ్వేతప్రసాద్‌కు బిస్మిల్లా ఖాన్ పురస్కారం




'సర్కారు వారి పాట' సినిమాతోపాటుగా పలు విజయవంతమైన చిత్రాల్లో గాయనిగా తనకంటూ ప్రత్యేక శైలిని ప్రదర్శించిన బహుముఖ ప్రజ్ఞాశాలి శ్వేతప్రసాద్‌ను బిస్మిల్లాఖాన్ పురస్కారం వరించింది. వీణా విద్వాంసురాలైన ఆమె దేశ విదేశాల్లో కూడా పలు కార్యక్రమాల్లో పాల్గొని తన ప్రతిభను చాటారు. హైదరాబాద్‌కు చెందిన శ్వేతప్రసాద్ కర్నాటక సంగీత విభాగంలో 2022-23 సంవత్సరానికిగాను ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం నాడు న్యూఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జాతీయ సాంస్కృతిక కార్యదర్శి ఉమా నండూరి, సంగీత, నాటక అకాడమీ వైస్ చైర్మన్ సంధ్య ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా శ్వేతప్రసాద్ సంతోషాన్ని వ్యక్తంచేశారు. కళాకారులకు ఇలాంటి అవార్డులు రావటంతో ప్రతిభ మరింత ద్విగుణీకృతం అవుతుందన్నారు.

డిసెంబర్ 25న బేబీజాన్ విడుదల

వరుణ్ ధావన్, కీర్తిసురేష్, గబ్బి నటించిన చిత్రం 'బేబీజాన్' డిసెంబర్ 25న విడుదల కానుంది. కాలీస్ దర్శకత్వం వహించారు. కోలీవుడ్‌లో సూపర్‌హిట్ సినిమా 'తెరి'కి ఇది రీమేక్. తమిళ దర్శకుడు అట్లీ, సినీ 1 స్టూడియోస్, ఏ ఫర్ యాపిల్ పతాకాలపై జ్యోతీ దేశ్‌పాండే, మురాద్ ఖేతనీ, ప్రియా అట్లీ ఈ సినిమాను నిర్మించారు. ఇటీవల ఈ సినిమా నుంచి మేకర్లు ఓ పాట విడుదల చేశారు. ఈ పాట సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌లో ఉంది.

షూటింగ్‌లో 'కన్నప్ప'



మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'కన్నప్ప'. హిందీలో మహాభారతం సిరీస్‌ను రూపొందించిన ముఖేష్‌కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా రానుంది. అవా ఎంటర్ టైనర్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై సీనియర్ నటుడు మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. విదేశాల్లో కూడా ఈ సినిమా షూటింగ్ కొనసాగుతోంది. వచ్చే ఏడాది ప్రథమార్ధంలో షూటింగ్‌ను పూర్తిచేసి షూటింగ్ అనంతర కార్యక్రమాలను చేపడతామని మేకర్లు ప్రకటించారు. ఈ డిసెంబర్‌లో ఈ సినిమా విడుదల అవుతుందని మేకర్లు తొలుత ప్రకటించినా షూటింగ్ పార్టు కొద్దిమేర పెండింగ్‌లో ఉండటంతో ఏప్రిల్ 25న విడుదల వాయిదా వేశారు. ఈ మేరకు ఇటీవల పోస్టర్ కూడా విడుదల చేశారు. ఈ సినిమాలో మంచు విష్ణు ప్రధాన పాత్ర చేయగా, ప్రభాస్, అక్షయ్‌కుమార్, శివరాజ్‌కుమార్ లాంటి నటులు అతిథి పాత్రల్లో కనిపించనున్నారు. కాజల్, మోహన్‌బాబు, శరత్‌కుమార్ తదితరులు కూడా నటిస్తున్నారు.

'వేరే లెవెల్ ఆఫీస్' వెబ్ సిరీస్ ట్రైలర్

ఆహా ఓటీటీలో 'వేరే లెవెల్ ఆఫీస్' వెబ్ సిరీస్ డిసెంబర్ 12 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ వెబ్ సిరీస్ ట్రైలర్‌ను హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో మేకర్లు సోమవారం విడుదల చేశారు. వరుణ్ వరుణ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వరుణ్ చౌదరి గోగినేని నిర్మిస్తున్నారు. ఇ.సత్తిబాబు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్‌జే కాజల్, అఖిల్ సార్థక్, శుభశ్రీ, మిర్చి కిరణ్, రీతూ చౌదరి, స్వాతి చౌదరి, వసంతిక, మహేష్ మిట్టా ప్రధాన పాత్రల్లో నటించారు. దర్శకుడు సత్తిబాబు మాట్లాడుతూ తమిళంలో ఈ వెబ్‌సిరీస్ భారీ విజయాన్ని నమోదుచేసుకుందన్నారు. దాన్ని తెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నంలో ఆహా టీమ్ తనను సంప్రదించారన్నారు. తెలుగుకోసం ఒరిజినల్ నుంచి 50 శాతం మార్పుచేశామన్నారు.

వినియోగదారుల ఫోరం సభ్యుల నియామకాలు ఆపండి : హైకోర్టు

ప్రజాశక్తి - అమరావతి : రాష్ట్రంలోని జిల్లాల వినియోగదారుల ఫోరంల ప్రెసిడెంట్లు, సభ్యుల నియామాకాలను చేయరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. గత ప్రభుత్వంలో ఫోరంల ప్రెసిడెంట్లు, సభ్యుల నియామాల్లో కొందరి విషయంలో అభ్యంతరాలు లేవనెత్తుతూ 2022లో పిటిషన్లు దాఖలయ్యాయి. కడప, గుంటూరు, చిత్తూరు, నెల్లూరు ఫోరం ప్రెసిడెంట్లతో పాటు కడప, తిరుపతి ఫోరం సభ్యుల నియామకాలను రద్దు చేస్తూ జస్టిస్ మన్మథరావు ఇటీవల తీర్పు చెప్పారు. ఈ తీర్పు వల్ల ఖాళీ అయిన ప్రెసిడెంట్లు, సభ్యుల స్థానంలో పర్సన్ ఇన్చార్జ్ వ్యవహరించాలని పౌరసరఫరాల శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీని ఆదేశించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ పదవులు కోల్పోయిన కొందరు ప్రెసిడెంట్లు, సభ్యుల అప్పీళ్లను ఇద్దరు జడ్జీల డివిజన్ బెంచ్ సోమవారం విచారించింది, సింగిల్ జడ్జి తీర్పు వల్ల ఖాళీ అయిన పోస్టులను ఈ నెల 27వ తేదీ వరకు నియామకాలు చేయరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

భారత్ ఘన విజయం



పెర్త్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరిగిన తొలి టెస్ట్‌లో భారత ఘన విజయం సాధించింది. పెర్త్ వేదికగా జరిగిన ఈ టెస్ట్‌లో భారత్ 295పరుగుల తేడా ఆస్ట్రేలియాపై గెలిచింది. ఓవర్‌నైట్ స్కోర్ 3వికెట్ల నష్టానికి 12పరుగులతో సోమవారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆస్ట్రేలియా జట్టును 238 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆసీస్ జట్టులో హెడ్(89), మిఛెల్ మార్ష్(47), క్యారీ(36) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. బుమ్రా, సిరాజ్‌కు మూడేసి, సుందర్‌కు రెండు, నితీశ్‌రెడ్డి, హర్షిత్ రాణాకు ఒక్కో వికెట్ దక్కాయి. కెప్టెన్‌గా పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ టెస్ట్‌లో బుమ్రా ఏకంగా ఏకంగా 8వికెట్లు పడగొట్టి టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించాడు. దాంతో ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా 1-0 ఆధిక్యతలో నిలిచింది. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ కేవలం 150 పరుగులకే పరిమితమైనా.. ఆస్ట్రేలియాను 104 పరుగులకే కుప్పకూలింది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ యశస్వి జైస్వాల్(161 పరుగులు), విరాట్ కోహ్లీ (100 పరుగులు), కేఎల్ రాహుల్ (77 పరుగులు) బ్యాటింగ్‌లో రాణించడంతో 6వికెట్ల నష్టానికి 487 పరుగుల ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి ఆసీస్ ముందు 534 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆసీస్‌జట్టు నాల్గోరోజు 238 పరుగుల వద్ద కుప్పకూలింది. దీంతో టీమిండియా 295 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఆసీస్‌పై సెంచరీ కొట్టి టీమిండియా రన్ మెయిన్ విరాట్ కోహ్లీ... ఆసీస్‌గడ్డపై అత్యధిక సెంచరీలు కొట్టిన సచిన్ టెండూల్కర్ రికార్డును బ్రేక్ చేశాడు. తాజా సెంచరీతో విరాట్ కోహ్లీ(7) అగ్రస్థానంలో నిలువగా.. సచిన్(6సెంచరీలు) ఆ తర్వాత స్థానంలో ఉన్నాడు. ఇక గవాస్కర్(5), లక్ష్మణ్(4), పుజరా(3) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జస్ప్రీత్ బుమ్రాకు లభించగా.. ఆడిలైడ్ వేదికగా డిసెంబర్ 6నుంచి రెండోటెస్ట్ ప్రారంభం కానుంది.

తొలి టెస్ట్‌లో 295 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చిత్తు

స్కోర్‌బోర్డు...

ఇండియా తొలి ఇన్నింగ్స్ : 150ఆలౌట్
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 104ఆలౌట్
ఇండియా రెండో ఇన్నింగ్స్ : 487/7

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : స్వీనే (ఎల్‌బి)బుమ్రా 0, ఖవాజా (సి)పంత్ (బి)సిరాజ్ 4, కమిన్స్ (సి)కోహ్లీ (బి)సిరాజ్ 2, లబూషేన్ (ఎల్‌బి) బుమ్రా 3, స్మిత్ (సి)పంత్ (బి)సిరాజ్ 17, హెడ్ (సి)పంత్ (బి)బుమ్రా 89, మార్ష్ (బి)నితీశ్‌రెడ్డి 47 కాన్వే (బి)హర్షిత్ రాణా 36, స్టార్క్ (సి)ధృవ్ జురెల్ (బి)సుందర్ 12, లియాన్ (బి)సుందర్ 0, హేజిల్‌వుడ్ (నాటౌట్) 4, అదనం 24. (58.4ఓవర్ల లో ఆలౌట్) 238పరుగులు. **వికెట్ల పతనం:** 1/0, 2/9, 3/12, 4/17, 5/79, 6/161, 7/182, 8/227, 9/227, 10/238 **బౌలింగ్:** బుమ్రా 12-1-42-3, సిరాజ్ 14-2-51-3, హర్షిత్ రాణా 13.4-1-69-1, సుందర్ 15-0-48-2, నితీశ్ రెడ్డి 4-0-21-1.

డబ్ల్యుటిసి పాయింట్లలో మళ్లీ టాప్‌లోకి భారత్

దుబాయ్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్ట్‌లో భారత్ 295పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) పాయింట్ల పట్టికలో భారత్ మళ్లీ అగ్రస్థానానికి ఎగబాకింది. ఈ ఓటమితో డబ్ల్యుటిసి పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా (57.69శాతం) విజయాలతో రెండోస్థానానికి పడిపోగా.. భారత్ 61.11శాతం పాయింట్లతో అగ్రస్థానానికి ఎగబాకింది. న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌కు ముందు భారత్ డబ్ల్యుటిసి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో భారత్ 0-3తో వైట్‌వాష్‌కు గురవ్వడంతో రెండోస్థానానికి పడిపోయిన విషయం తెలిసిందే.

డబ్ల్యుటిసి పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	డ్రా	పా	పిసిటి
1. ఇండియా	15	9	5	1	110	61.11
2. ఆస్ట్రేలియా	13	8	4	1	90	57.69
3. శ్రీలంక	9	5	4	0	60	55.56
4. న్యూజిలాండ్	11	6	5	0	60	54.55
5. దక్షిణాఫ్రికా	8	4	3	1	52	54.17
6. ఇంగ్లండ్	19	9	9	1	93	40.79
7. పాకిస్తాన్	10	4	6	0	40	33.33
8. బంగ్లాదేశ్	10	3	7	0	33	27.50
9. వెస్టిండీస్	9	1	6	2	20	18.52



భువనేశ్వర్‌కు రూ.10.75కోట్లు

13ఏళ్ల సూర్యవంశీకి రూ.1.10కోట్లు

ముగిసిన ఐపిఎల్ వేలం

జెడ్డా(సౌదీ అరేబియా): సౌదీ అరేబియాలోని జెడాలో రెండ్రోజులపాటు జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) వేలం సోమవారంతో ముగిసింది. రెండోరోజైన సోమవారం టీమిండియా పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) భారీ మొత్తానికి వెచ్చించింది. ఏకంగా రూ.10.75 కోట్లు ఖర్చుపెట్టి భువీని కొనుగోలు చేసింది. భువనేశ్వర్ కుమార్‌ను దక్కించుకొనేందుకు చివరి వరకు ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ బెంగళూరుతో పోటీపడింది. అలాగే 13ఏళ్ల టీనేజర్ వైభవ్ సూర్యవంశీని రూ.1.10కోట్లకు రాజస్తాన్ రాయల్స్ కైవసం చేసుకోవడం రెండోరోజు వేలంలో ప్రధాన విశేషాలు. ఈసారి వేలంలో రిషబ్ పంత్(రూ.27కోట్లు) రికార్డు ధర పలికి చరిత్ర సృష్టించగా.. ఆ తర్వాత శ్రేయస్(రూ.26.75కోట్లు) రెండోస్థానంలో నిలిచాడు. వెంకటేశ్ అయ్యర్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ ఏకంగా రూ.23.75కోట్లకు కొనుగోలు చేయడం విశేషం. రెండోరోజు భోజన విరామ సమయం నాటికి 10 ఫ్రాంచైజీలు కలిసి 165మంది ఆటగాళ్లను మాత్రమే కొనుగోలు చేశాయి.

రెండోరోజు వేలంలో అత్యధిక ధర పలికిన ఆటగాళ్లలో కొందరు: భువనేశ్వర్ కుమార్, రూ.10.75కోట్లు, విల్ జాక్స్‌ను రూ.5.25కోట్లు, టిమ్ డేవిడ్(రూ.3కోట్లు) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దక్కించుకుంది. ఇక అన్షుల్ కంబోజ్‌ను రూ.3.40కోట్లకు చెన్నై, తుషార్ దేశ్‌పాండేను రూ.6.50కోట్లకు రాజస్తాన్ రాయల్స్ చేజిక్కించుకున్నాయి. ఇక ముఖేశ్ కుమార్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ ఏకంగా రూ.8కోట్లు పెట్టి కొనుగోలు చేయగా.. దీపక్ చాహర్‌ను ముంబయి ఇండియన్స్ రూ.9.25కోట్లకు దక్కించు కుంది. ఆకాశ్‌దీప్‌ను లక్నో రూ.8.00కోట్లకు, స్పెన్సర్ జాన్సన్‌ను కోల్‌కతా రూ.2.00కోట్లకు సోమవారం వేలంలో చేజిక్కించుకోగా.. ఫెర్గ్యుసన్‌ను పంజాబ్ కింగ్స్ రూ.2.00కోట్లు కొట్టేసింది. ఇక ప్రియాన్ష్ ఆర్యాకు పంజాబ్ కింగ్స్ రూ.3.80 కోట్లు ఖర్చుపెట్టగా.. జోష్ ఇంగ్లిష్ పంజాబ్ కింగ్స్‌రూ.2.60కోట్లకు దక్కించుకుంది.

వణుకుతున్న 'సంక్షేమం'

- చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న హాస్టల్ విద్యార్థులు
- దుప్పట్లు, కార్పెట్లు పంపిణీ చేయని ప్రభుత్వం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లాలో కళాశాలల సంక్షేమ వసతిగృహ విద్యార్థులు చలికి గజగజ వణికిపోతున్నారు. పలు భవనాలు శిథిలావస్థకు చేరి కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వీరికి ప్రభుత్వం దుప్పట్లు, కార్పెట్లు సైతం పంపిణీ చేయకపోవడంతో చలి తీవ్రతను తట్టుకోలేక అనేక అవస్థలు పడుతున్నారు. జిల్లాలో తుని, జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం, చేబ్రోలు, తాళ్లరేవు, జిల్లా కేంద్రం కాకినాడలలో 22 కళాశాల హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో మూడు వేల మంది వరకూ విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులే ఉన్నారు. పది రోజులుగా జిల్లాలో చలి తీవ్రత విపరీతంగా పెరిగిపోయింది. గత రెండు రోజులుగా అర్ధరాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల లోపులోనే నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో హాస్టల్ విద్యార్థులు చలికి అల్లాడుతున్నారు. కటిక నేలపై పడుకోవాల్సి రావడంతో చలిని తట్టుకోలేక అనారోగ్యాలకు గురవుతున్నారు.

కాకినాడ జగన్నాథపురం, భానుగుడి సెంటర్, కరణం గారి జంక్షన్, తుని, పిఠాపురం, పెద్దాపురం తదితర వసతి గృహాలకు తలుపులు, కిటికీలు సరిగా లేవని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం విపరీతంగా చలిగాలులు వీస్తున్న తరుణంలో చలిని తట్టుకోలేక నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని వాపోతున్నారు. కొందరు ఇళ్ల నుంచి దుప్పట్లు కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. వాటినే ఇద్దరు ముగ్గురు విద్యార్థులు కప్పుకుంటున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పిఠాపురంలోని బాలుర కళాశాల హాస్టల్‌లో దుప్పట్లు లేకుండా చలి నుంచి రక్షణకు దగ్గర దగ్గరగా పడుకున్న విద్యార్థులు

చలికి ఇబ్బందులు పడుతున్నాం



వసతి గదులు సరిపోక ఆరు బయట నిద్రిస్తు న్నాం. చలిని తట్టుకోలేకపోతున్నాం. ప్రభుత్వం మాకు దుప్పట్లు, కార్పెట్లు ఇవ్వడం లేదు. ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లతో సరిపెట్టుకుంటున్నాం. అవి కూడా చిరిగిపోతున్నాయి. ప్రభుత్వం స్పందించి వెంటనే దుప్పట్లు పంపిణీ చేయాలి.

- పి.సుమన్, కళాశాల హాస్టల్ విద్యార్థి, కాకినాడ

దోమలు ఎక్కువగా ఉంటున్నాయి



చలితోపాటు దోమలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రులు నిద్ర పట్టడం లేదు. చదువుపై దృష్టి సారించలేకపోతున్నాం. చాలా హాస్టళ్లలో కిటికీలకు తలుపులు, మెస్‌లు లేవు. చలిగాలితోపాటూ దోమలు లోపలికి వచ్చేస్తున్నాయి. అనారోగ్యానికి గురవుతున్నాం.

- రాజ్యలక్ష్మి, కళాశాల హాస్టల్ విద్యార్థిని, కాకినాడ

కనీస వసతులు కల్పించాలి



రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతోంది. పలు హాస్టళ్ల కిటికీలు సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులు వణికిపోతున్నారు. ప్రభుత్వం వెంటనే దుప్పట్లు, కార్పెట్లు అందివ్వాలి. దోమ తెరలు పంపిణీ చేయాలి. మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఇతర కనీస వసతులు కల్పించాలి.

- ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కార్యదర్శి

సుమత్రా దీవిలో కొండచరియలు కూలి 16మంది మృతి

- ఆరుగురు గల్లంతు

కరో (ఇండోనేషియా) : సుమత్రా దీవిలో భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో 16మంది మరణించారు. కరో జిల్లాలోని ఒక రిసార్ట్‌లో మరో ఆరుగురి ఆచూకీ గల్లంతైందని అధికారులు తెలిపారు. గత వారంలో కురిసిన భారీ వర్షాలకు ఆదివారం రాత్రి కొండచరియలు విరిగిడడంతో నాలుగు కొండ ప్రాంత జిల్లాల్లో భారీ విధ్వంసం చోటు చేసుకుంది. బురద, రాళ్ళురప్పల కూడిన శిథిలాల కింద పడి పలువురు మరణించారు. వర్షాల ధాటికి నదులు పొంగిపోయాయి. ఇళ్లు కొట్టుకుపోయాయి. పొలాలు నీట మునిగాయి. పోలీసులు, సైనికులు, సహాయక సిబ్బంది అందరూ రంగంలోకి దిగారు. 16మృతదేహాలను సహాయక సిబ్బంది వెలికితీశారు. శిథిలాలను తొలగించి ఇంకా ఎవరైనా జీవించి వున్నారేమోనని గాలింపు చర్యలు చేపట్టనట్లు స్థానిక విపత్తు నిర్వహణా సంస్థ అధ్యక్షుడు నాదెక్ తెలిపారు. ఆకస్మికంగా సంభవించిన వరదల్లో పలువురు గాయపడ్డారు. 130హెక్టార్లలోని పంటలు, తోటలు నాశనమయ్యాయి.

అధికారులు, జర్నలిస్టులకు సుప్రీం షాక్

- జిహెచ్‌ఎంసి పరిధిలో హౌసింగ్ సొసైటీలకు భూకేటాయింపులు రద్దు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో హౌసింగ్ సొసైటీలకు చేసిన భూకేటాయింపులను సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. గతంలో ప్రభుత్వాలు ఎమ్మెల్యేలు, ఎంపిలు, న్యాయమూర్తులు, అధికారులు, జర్నలిస్ట్‌ల సొసైటీలకు భూములు కేటాయిస్తు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవోలను కొట్టివేసింది. కొన్ని వర్గాలకు మాత్రమే భూములు కేటాయించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ను ఉల్లంఘించడమే అని వ్యాఖ్యానించింది. సొసైటీలకు డబ్బులు వడ్డీతో పాటు తిరిగి ఇచ్చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశించింది. 2008లో ఆనాటి సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి... ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్ట్‌లు, హైకోర్టు న్యాయమూర్తులకు భూకేటాయింపులకు సంబంధించి 419, 420, 422, 425, 551 జీవోలు విడుదల చేశారు. కొన్ని వర్గాలకే బేసిక్ రేట్లతో స్థలాలు కేటాయించేలా ఈ జీవోలు ఉన్నాయని డాక్టర్ రావు, వివిజె చెలికాని, ప్రజా సంఘాలు ఆనాటి ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించగా, 2010లో జీవోను కొట్టివేస్తు తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం, సొసైటీలు దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ వాదనల తరువాత సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తుది తీర్పు వెలువరించింది.

సెప్టెంబర్ 8న స్థల పత్రాలు అందజేసిన సిఎం

మాజీ సిజెఐ ఎన్‌వి రమణ తన పదవీ విరమణకు ముందు... ఎమ్మెల్యేలు, ఎంపిలు, సివిల్ సర్వెంట్ల సొసైటీలను, జర్నలిస్ట్‌ల సొసైటీలను వేరు చేస్తూ మధ్యంతర తీర్పు నిచ్చారు. అర్హులైన జవహార్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ మెంబర్లకు సెప్టెంబర్ 8న స్థలం పత్రాలను తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. తాజా తీర్పుతో పత్రాలు పొందిన జర్నలిస్ట్‌లకు ఎదురుదెబ్బ తగిలినట్లయింది.



ఫిలిం ఫేర్ పోటీలో 'సత్య'

నటుడు సాయిదుర్గతేజ్ నటించిన 'సత్య' షార్ట్ ఫిలిం పలువురి మన్ననలను అందుకుంటోంది. తాజాగా ఫిలింఫేర్ షార్ట్ ఫిలిం అవార్డ్స్-2024లో పోటీపడుతోంది. ఫేపుల్స్ ఛాయిస్ కేటగిరిలో పోటీలో నిలిచింది. ఈ సందర్భంగా సాయిదుర్గ తేజ్ మీడియా ద్వారా స్పందించారు. అందరి మనసులకు దగ్గరైన షార్ట్ ఫిలిం 'సత్య' అని, దానిని చూసి ఓటేయాలని ప్రేక్షకులను కోరారు. దిల్‌రాజు ప్రొడక్షన్స్‌తో కలిసి తమ విజయదుర్గ ప్రొడక్షన్స్ సంస్థలో చేసిన తొలి ప్రయత్నంగా 'సత్య' ఎన్నో మధురానుభూతులను ఇచ్చిందన్నారు. ఈ షార్ట్ ఫిలింలో స్వాతిరెడ్డి కథానాయిక. హర్షిత్, హన్షిత నిర్మాతలు. విజయకృష్ణ వీకే దర్శకత్వం.

ఇక ప్లాస్టిక్ కాలుష్యంపై దృష్టి !

- 1న బుసాన్‌లో సమావేశం
- 175 దేశాల హాజరు

బుసాన్, దక్షిణ కొరియా : గత రెండు వారాలుగా బాకూలో జరిగిన వాతావరణ చర్చలు ఆదివారంతో ముగియడంతో తాజాగా ప్లాస్టిక్ భూతాన్ని భూగోళం నుండి తరిమికొట్టడంపై దేశాలు దృష్టి పెట్టాయి. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందించేందుకు గానూ ఐక్యరాజ్య సమితి మధ్యవర్తిత్వ ఒప్పందానికి పునాదులు వేయడానికి తీర ప్రాంత నగరమైన బుసాన్‌లో నేతలు సమావేశం కానున్నారు. డిసెంబరు 1న 175 దేశాలకు చెందిన ప్రతినిధులు చర్చలు జరిపి, ఒక ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని ఆశిస్తున్నారు. ఏటా వాతావరణ మార్పులపై జరిగే సమావేశం (కాప్) మాదిరిగానే వీరు కూడా ప్లాస్టిక్‌ను రూపుమాపేందుకు చట్టబద్ధంగా కట్టుబడి వుండేలా ఒక ఒప్పందాన్ని రూపొందించాలని భావిస్తున్నారు.

1992లో తొలిసారిగా వాతావరణ మార్పులపై ఐక్యరాజ్య సమితి ఒప్పందాన్ని ఆమోదించారు. 1994 నుండి అమల్లోకి వచ్చింది. 1995లో బెర్లిన్‌లో తొలి కాప్ సదస్సు జరిగింది. అయితే 2015లో చారిత్రక పారిస్ ఒప్పందం కుదరడానికి 21సంవత్సరాలు పట్టింది. కానీ ప్లాస్టిక్‌ను నిర్మూలించే విషయంలో 21ఏళ్ళు వేచి వుండలేమని ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం (యుఎన్‌ఇపి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంగర్ ఆండర్సన్ సోమవారం పత్రికా సమావేశంలో వ్యాఖ్యానించారు. సముద్ర జలాల్లో సహా మొత్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించాలంటూ 2022లో నైరోబిలో యుఎన్‌ఇపి ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

ప్లాస్టిక్ కాలుష్యం ఒక సమస్యగా మారిందన్న విషయంలో అంతర్జాతీయంగా ఏకాభిప్రాయం వుంది. ప్లాస్టిక్‌ను రీ సైక్లింగ్ చేయడంపై, కొన్ని రకాల ప్లాస్టిక్‌ను నిషేధించడంపై అనేక దేశాలు ఆసక్తిగా వున్నాయి. ఇప్పటికే కొన్ని మార్గాలు కూడా చేపట్టారు. ఉదాహరణకు భారతదేశంలో 2022 నుండి ఒకసారి వాడే ప్లాస్టిక్‌ను నిషేధించారు.

కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 3,332 బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీ

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో 3,332 బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుకాంత్ మజుందర్ తెలిపారు. లోక్‌సభలో ఒక ఎంపి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఒబిసి 1,394, ఎస్‌సి 1,162, ఎస్‌టి 776 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

సెంట్రల్ యూనివర్శిటీల్లో 5,182 టీచింగ్ పోస్టులు ఖాళీ

సెంట్రల్ యూనివర్శిటీల్లో 2024 అక్టోబర్ 31 వరకు 5,182 టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అందులో 1,546 ఒబిసి, 740 ఎస్‌సి, ఎస్‌టి 464 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అదానీతో విద్యుత్ ఒప్పందాల సమీక్ష

- బంగ్లా ప్రభుత్వం నిర్ణయం, కమిటీ ఏర్పాటు

ఢాకా : ప్రవాస జీవితం గడుపుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనా హయాంలో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను సమీక్షించాలని ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పడిన బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం నిర్ణయించింది. అదానీతో కుదుర్చుకున్న ఒప్పందం కూడా వీటిలో ఉంది. ఒప్పందాలను సమీక్షించేందుకు ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. అదానీ గ్రూప్ సహా వివిధ వ్యాపార సంస్థలతో మాజీ ప్రధాని షేక్ హసీనా కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను సమీక్షించాలని విద్యుత్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన రివ్యూ కమిటీ సూచించింది. దీనికి అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2010వ సంవత్సరం నాటి విద్యుత్, ఇంధన సరఫరాల చట్టం కింద సంతకాలు జరిగిన ఒప్పందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సమీక్షిస్తుంది. '2009–2024 మధ్య షేక్ హసీనా నిరంకుశ పాలనలో సంతకాలు జరిగిన ప్రధాన విద్యుదుత్పత్తి ఒప్పందాలను సమీక్షించేందుకు పేరొందిన న్యాయ, దర్యాప్తు సంస్థను నియమించాలని విద్యుత్, ఇంధన, ఖనిజ వనరుల మంత్రిత్వ శాఖకు చెందిన రివ్యూ కమిటీ సిఫార్సు చేసింది' అని ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ కార్యాలయం ఓ అధికారిక ప్రకటనలో తెలిపింది.

ఇమ్రాన్ మద్దతుదారుల లాంగ్‌మార్చ్

- పోలీసుల ఉక్కుపాదం

ఇస్లామాబాద్ : అక్రమ క్రిమినల్ కేసుల్లో ఇరికించి, ఏడాదికి పైగా జైల్లో నిర్బంధించిన తమ పార్టీ నేత ఇమ్రాన్‌ఖాన్‌ను తక్షణమే విడుదలజేయాలని కోరుతూ వేలాదిమంది పాకిస్తాన్ తెహ్రిక్ ఇన్సాఫ్ (పిటిఐ) మద్దతుదారులు సోమవారం లాంగ్ మార్చ్ నిర్వహించారు. దేశ నలుమూలల నుండి సోమవారం ఇస్లామాబాద్‌కు ప్రదర్శనగా చేరుకుంటున్నారు. గత రెండు రోజులుగా అమల్లో వున్న లాక్‌డౌన్ ఆంక్షలను ధిక్కరించి లాంగ్ మార్చ్‌లో పాల్గొంటున్నారు. పోలీసులు శుక్రవారం నుండి ఇప్పటివరకు 4వేల మందికి పైగా ఇమ్రాన్ పార్టీ మద్దతుదారులను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వం ఎన్ని అవరోధాలు కల్పించినా వాటన్నిటిని అధిగమించి పెద్ద సంఖ్యలో జనం రాజధానికి చేరుకోవడం విశేషం.

మహిళలకు ఇల్లే నరకం!

- గతేడాదిలో భాగస్వాములు లేదా బంధువుల చేతుల్లో రోజుకు సగటున 140మంది మహిళల హత్య
- ఐరాస నివేదిక వెల్లడి



న్యూయార్క్ : ఈ భూగోళం మీద మహిళలకు. బాలికలకు అత్యంత ప్రాణాంతకమైన ప్రదేశం ఏదైనా వున్నదీ అంటే అది వారి ఇల్లే అని ఐరాస అనుబంధ సంస్థలు పేర్కొన్నాయి. గతేడాది సగటున రోజుకు 140మంది మహిళలు, బాలికలు వారి భాగస్వాముల లేదా బంధువుల చేతుల్లో మరణించారని ఈ ప్రపంచ సంస్థకు చెందిన రెండు సంస్థలు వివరించాయి. . 2023 ఒక్క ఏడాదిలోనే దాదాపు 51,300మంది మహిళలు ఈ విధంగా హత్యకు గురయ్యారని యుఎన్ వుమెన్, యుఎన్ ఆఫీస్ ఆఫ్ డ్రగ్స్ అండ్ క్రైమ్ అనే సంస్థలు తమ నివేదికలో వెల్లడించాయి. 2022లో ఈ సంఖ్య 48,800గా వుంది. దేశాల నుండి మరింతగా డేటా అందుబాటులోకి రావడం వల్ల పెరిగిందని నివేదిక పేర్కొంది. అంతర్జాతీయంగా మహిళలపై హింస నిర్మూలనా దినోత్సవమైన సోమవారం ఈ నివేదిక వెలువడింది.

ప్రపంచవ్యాప్తంగా మహిళలు ప్రతి చోటా ఏదో ఒక రూపంలో లైంగిక హింసకు గురవుతునే వున్నారని ఆ రెండు సంస్థలు నొక్కి చెప్పాయి. దీనికి ఏ ప్రాంతమూ మినహాయింపు కాదని పేర్కొన్నాయి. పైపెచ్చు మహిళలకు వారు నివసించే ఇల్లే అత్యంత ప్రమాదకరమైన స్థలంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ హత్యలు అధికంగా ఆఫ్రికాలో చోటు చేసుకున్నాయి. 2023లో 21,700మంది హత్య చేయబడ్డారని అంచనా వేసినట్లు నివేదిక పేర్కొంది. ప్రతి లక్ష మందికి 2.9మంది బాధితులు వున్నారని తెలిపింది. గతేడాది అమెరికాలోను ఈ మరణాల రేటు ఎక్కువగానే వుంది. పశ్చిమ దేశాలతో పోల్చితే ఆసియా దేశాల్లో ఈ నేరాలు తక్కువే. ప్రతి లక్షమందిలో 0.8మంది బాధితులు నమోదయ్యారు. యూరప్‌లో ఈ సంఖ్య 0.6గా వుంది. ఇందుకు పూర్తి విరుద్ధంగా ఇంటికి వెలుపల, కుటుంబాలకు బయట పురుషుల హత్యలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని నివేదిక పేర్కొంది. 2023లో జరిగిన హత్యల్లో 80శాతం మంది పురుషులు కాగా 20శాతం మంది మహిళలు. అయితే కుటుంబాల పరిధిలో ప్రాణాంతకమైన హింస ప్రధానంగా మహిళలపైనే జరుగుతోంది. ఈ హత్యలను నివారించేందుకు ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నప్పటికీ హత్యలు ఇంకా ఆందోళనకర స్థాయిలోనే కొనసాగుతున్నాయని నివేదిక పేర్కొంది. తరచుగా ఈ హత్యలు ఈ లింగ ఆధారిత హింసకు పరాకాష్టగా వుంటాయని, వీటిని సకాలంలో, సమర్ధవంతమైన రీతిలో జోక్యం చేసుకోవడం ద్వారా నివారించవచ్చని ఆ నివేదికలో ఐక్యరాజ్య సమితి సంస్థలు పేర్కొన్నాయి.

బిజెపిదే బాధ్యత

- సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి
- సంభాల్‌లో హిందు – ముస్లిం ఘర్షణలపై రాహుల్‌గాంధీ
- 30 వరకూ ఆంక్షలు విధించిన జిల్లా యంత్రాంగం

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో హింసాత్మక పరిస్థితులపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ స్పందించారు. అధికారాన్ని ఉపయోగించి హిందూ, ముస్లింల మధ్య బిజెపి సృష్టిస్తున్న గొడవ దేశ, రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదని పేర్కొన్నారు. సంభాల్ ఘర్షణ, మరణాలకు దారితీసిన వ్యవహారంలో బిజెపి నేరుగా బాధ్యత వహించాలని వివరించారు. ఈ విషయంలో భారత సర్వోన్నత న్యాయస్థానం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. ఆదివారం సంభాల్‌లోని మొఘల్ కాలం నాటి జామా మసీదును రెండోసారి సర్వే నిర్వహించటానికి అధికార బృందం రాగా.. స్థానికులు వ్యతిరేకత తెలపటంతో పోలీసులు భాష్పవాయువును, రబ్బరు బుల్లెట్లను ప్రయోగించారు. ఈ ఘటనలో ముగ్గురు ముస్లిం వ్యక్తులు చనిపోగా, పలువురికి గాయాలైన విషయం విదితమే. ఈ ఘటనపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా రాహుల్‌గాంధీ స్పందించారు. "యుపిలోని సంభాల్‌లో ఇటీవల చోటుచేసుకున్న వివాదంలో రాష్ట్రప్రభుత్వ పక్షపాత, తొందరపాటు వైఖరి చాలా దురదృష్టకరం. హింసలో, కాల్పుల్లో తమ ప్రియమైన వ్యక్తులను కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతి" అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అన్ని పార్టీలను సంప్రదించకుండా పాలకవర్గం తీసుకున్న చర్య అక్కడి వాతావరణాన్ని చెడగొట్టి, ప్రజల మరణాలకు దారి తీసిందని రాహుల్ పేర్కొన్నారు. దీనికి బిజెపి బాధ్యత వహించాలని వివరించారు. శాంతికి, పరస్పర సామరస్యానికి ఆయన పిలుపునిచ్చారు. మనమంతా కలిసి.. ఐక్యత, రాజ్యాంగం అనే మార్గంపై భారత్ ముందుకెళ్లేలా చూడాలనీ, మతతత్వం, విద్వేషం పైన కాదని రాహుల్ నొక్కి చెప్పారు.

ఆంక్షలు విధించిన జిల్లా యంత్రాంగం

ఆదివారం సంభాల్‌లో చోటుచేసుకున్న ఘర్షణ పరిస్థితుల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అక్కడ నిషేదాజ్ఞలు విధించింది. బయటివారెవరూ ఇక్కడకు రాకుండా ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆంక్షలు ఈనెల 30 వరకు అమలులో ఉండనున్నాయి. సంభాల్‌లో 24 గంటల పాటు అధికారులు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. జిల్లా యంత్రాంగం సోమవారం అన్ని పాఠశాలలకూ సెలవు ప్రకటించింది.



కూతూపరంబ అమరవీరులకు ఘన నివాళి

- కేరళవ్యాప్తంగా సంస్మరణ సభలు, ర్యాలీలు

కన్నూర్ : కూతుపరంబ అమరవీరుల దినోత్సవం సందర్భంగా వీర యోధులకు నివాళులర్పిస్తూ సోమవారం రాష్ట్టవ్యాప్తంగా సంస్మరణ సభలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూతుపరంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన అమరవీరుల సంస్మరణ సభలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రసంగించారు. కూతూపరంబ అమర వీరుల స్మృతి భవిష్యత్ పోరాటాలకు శక్తిగా నిలుస్తుందని తెలిపారు. నవంబరు 25, 1994న కూతుపరంలో యుడిఎఫ్ ప్రభుత్వ వాణిజ్య విధానాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కెకె రాజీవన్, శిబులాల్, రోషన్, మధు, బాబు అమరులయ్యారు. తీవ్రంగా గాయపడిన పుష్పన్ ఏళ్ల తరబడి మంచానపడి, గత నెలలో కన్నుమూశారు. 'కూతుపరంలోని ఆరుగురు సహచరుల స్పష్టమైన జ్ఞాపకం మన భవిష్యత్ పోరాటాలకు శక్తిగా ఉంటుంది. కూతుపరంబ యుద్ధంలో వీర యోధులకు వందనం' అని విజయన్ తెలిపారు.

లౌకికవాదం, సోషలిజం రాజ్యాంగ మౌలిక లక్షణాలు

- ఈ పదాలను తొలగించాలన్న పిటిషన్ కొట్టివేస్తూ సుప్రీం స్పష్టీకరణ

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

లౌకికవాదం, సోషలిజం అనేవి భారత రాజ్యాంగ మౌలిక లక్షణాలని, వాటిని తొలగించే ప్రశ్నే లేదని అత్యున్నత న్యాయస్థానం మరోసారి స్పష్టం చేసింది. రాజ్యాంగం నుంచి ఈ రెండు పదాలను తొలగించాలంటూ కొందరు వ్యక్తులు వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు నిర్ద్వంద్వంగా కొట్టివేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. ఇవి భారత రాజ్యాంగంలో అంతర్భాగమని, వీటిని తొలగించడం కుదరదని అత్యున్నత న్యాయస్థానం నొక్కి చెప్పింది. రాజ్యాంగ పీఠిక లౌకిక ధర్మాన్ని ప్రతిబింబిస్తుందని కోర్టు స్పష్టం చేసింది. 1976లో 42వ రాజ్యాంగ సవరణతో సెక్యులరిజం, సోషలిజం వంటి పదాలను జోడించారు. బిజెపి మాజీ ఎంపి సుబ్రమణ్యస్వామి, న్యాయవాది విష్ణుశంకర్ జైన్, బలరాం సింగ్, అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ ఈ పిటిషన్లు వేశారు. గత వారం ఇరు పక్షాల వాదనలను విన్న సుప్రీం కోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పివి సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ తీర్పును వెలువరించింది.. 1976లో రాజ్యాంగ సవరణతో సెక్యులరిజం, సోషలిజం తదితర పదాలను చేర్చారని, ఇక 1949లో ఆమోదించిన రాజ్యాంగానికి మరింత పరిపుష్టి తెచ్చేవే ఈ రెండు పదాలు అని సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు.

సోషలిస్ట్, సెక్యులర్ అనే పదాలకు వివరణలు ఉన్నాయని, వాటిని వేర్వేరుగా అన్వయించుకూడదని ధర్మాసనం అభిప్రాయపడింది. 1976 కి ముందు రాజ్యాంగ పీఠికలో సెక్యులర్ పదం లేనప్పటికీ, లౌకికవాదం తప్పనిసరిగా దేశం నిబద్ధతను సూచిస్తుందని పేర్కొంది. 1994 నాటి ఎస్ఆర్ బొమ్మై కేసులోనూ, కేశవానంద భారతి కేసులోనూ ఇదే చెప్పినట్లు సుప్రీంకోర్టు గుర్తు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 రాజ్యాంగాన్ని సవరించే అధికారాన్ని పార్లమెంట్ ఇస్తుందని, అయితే అది సవాల్ చేయలేమని స్పష్టం చేసింది.

విద్యుత్ బస్సులను ఆర్‌టిసినే కొనుగోలు చేయాలి

- స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

విద్యుత్తు బస్సుల కొనుగోలు,నిర్వహణను ఆర్టిసి చేపట్టేట్లు చర్యలు తీసుకోవాలని ఆర్టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటి ప్రభుత్వాన్ని కోరింది. ఈ అంశంపై ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎస్‌కె. జిలాని బాషా, అధ్యక్షప్రచార కార్యదర్శులు సిహెచ్.సుందరరావు, టి.పి.ఆర్ దొర సోమవారం సిఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఇతర రాష్ట్రాలలో విద్యుత్తు బస్సుల కొనుగోలు ప్రైవేటు సంస్థలే చేస్తున్నాయని, వాటిపై కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ ఆ సంస్థలకే దక్కుతున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. వీటి నిర్వహణ, కార్యకలాపాలు ఆర్టిసి ద్వారా ప్రైవేటు సంస్థలే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల ఆర్టిసికి ఈ బస్సులపై వచ్చే ఆదాయం కంటే ప్రైవేటు సంస్థలకు చెల్లిస్తున్న సర్వీసు చార్జీ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ఇది ఆర్టిసికి పెనుభారం కావచ్చని తెలిపారు. ఈ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో విద్యుత్తు బస్సులు కొనుగోలు, కార్యకలాపాలు, నిర్వహణ ఆర్టిసి (ఎపిపిటిడి)నే చేపట్టేటట్లు ఆదేశాలు ఇవ్వాలని సిఎంను కోరారు. దీనివల్ల నిరుద్యోగులకు ఉపాధి, ప్రయాణీకులకు భద్రత కల్పించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఆర్టిసికి నాలుగు వర్క్‌షాపులు ఉన్నాయని, వీటిలో అన్ని మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన సిబ్బంది ఉన్నట్లు చెప్పారు. ఒక వర్క్‌షాపును అభివృద్ధి చేసి విద్యుత్ బస్సుల తయారీ, మరమ్మతులకు వినియోగించాలని సూచించారు.

అదానీతో ఒప్పందాన్ని రద్దు చేయాలి:

అనంతపురం రామగిరిలో గతంలో విండ్ ఎనర్జీ ప్రాజెక్టుకు సంబంధించిన 330 ఎకరాల భూమిని అదానీకి లీజుకు ఇస్తూ చేసుకున్న ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలని ఆర్టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు ఆర్టిసి ఎండికి ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎస్‌కె.జిలాని బాషా, అధ్యక్షులు సిహెచ్.సుందరరావులు సోమవారం లేఖ రాశారు. ఈ ఒప్పందం సందర్భంగా ఆర్థిక అవకతవకలు జరిగినట్లు కథనాలు వస్తున్నందున, ఈ స్థలాన్ని సొంత నిధులతో లేక ఇతర ఆర్థిక సంస్థల సహకారంతోనో అభివృద్ధి చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోయే రోజుల్లో ఎలక్ట్రికల్ బస్సుల అవసరాలు తీర్చుకోవచ్చన్నారు. ఈ స్థలాన్ని రౌండ్ క్లాక్ సోర్స్‌గా రాత్రి వేళల్లో విండ్ ఎనర్జీ, పగలి వేళల్లో సోలార్ ఎనర్జీని 24 గంటలు ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు.

'ఇవి'లకు ప్రత్యేక టారిఫ్

(మొదటి పేజీ తరువాయి)

అవుతుందని, దీనిని ఎన్‌టిపిసి విద్యుత్ వ్యాపార్ నిగమ్ లిమిటేడ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది తెలిపారు. దీనికి రాష్ట్రప్రభుత్వం తరపున జిఎడి గానీ, ఆర్థిక శాఖ గానీ గ్యారెంటీ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జెన్‌కో ఎండి కెవిఎన్ చక్రధర్ బాబు, డిస్కంల సిఎండిలు ఐ పృథ్వీతేజ్, పఠాన్‌శెట్టి రవిసుభాష్, కె సంతోషరావు పాల్గొన్నారు.

మోడీ పాలనలో స్వచ్ఛమైన అవినీతి

(మొదటి పేజీ తరువాయి)

పనిచేయకపోతే ఈ విషయంలో జగన్‌మోహన్‌రెడ్డిని సమర్థించినట్లే భావించాల్సి ఉంటుందని తెలిపారు. దేశంలోనే ఇది అతిపెద్ద రాజకీయ కుంభకోణమని చెప్పారు. అవినీతిలేని రాజకీయాలు చేస్తానని చెబుతున్న మోడీ, జగన్ ఇద్దరూ మంచి స్నేహితులని పేర్కొన్నారు. అందువల్లే కేంద్రంలోనూ దీనిపై చర్చ చేయడం లేదని, కేంద్రంలో భాగస్వామిగా ఉన్న టిడిపి కూడా ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కుంభకోణం నేపథ్యంలో అదానీ పేరు చెప్పేందుకు కూడా సాహసించ లేదని పేర్కొన్నారు. కేజ్రీవాల్, సోరేన్లను చిన్నచిన్న కేసుల్లో అరెస్టులు చేశారని, అమెరికా న్యాయ విభాగం కేసు నమోదు చేసినా జగన్‌పై కనీస విచారణకు సిద్ధపడటం లేదని తెలిపారు. ఈడి, సిబిఐ ఎందుకు దీనిపై విచారించడం లేదో కేంద్రం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. జగన్‌ను విచారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంత పెద్ద కుంభకోణం జరిగిందని కేసు నమోదైనా చంద్రబాబు ఎందుకు మౌనం వహిస్తున్నారో తెలపాలన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మౌనం వీడి జగన్‌పై చర్య తీసుకోవాలని కోరారు.

మిట్టల్ స్టీలు రాయలసీమలో పెట్టాలి

అనకాపల్లి పరిధిలో అర్సెల్లర్ మిట్టల్ స్టీలు ప్లాంటు ఏర్పాటు చేయాలనో ఆలోచన వెనుక విశాఖ స్టీలు ప్లాంటును నాశనం చేయాలనే కుట్ర ఉందని రాఘవులు విమర్శించారు. ఇప్పటికే ఉన్న ప్లాంటు పరిధిలో కొత్త ప్లాంటు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందో తెలపాలని డిమాండు చేశారు. దీనివెనుక కేంద్రం కుట్ర దాగుందని, దానికి చంద్రబాబు వంతపాడుతున్నారని అన్నారు. కేంద్రం ప్రైవేటీకరణదిశగా చకచకా ముందుకు వెళుతుంటే రాష్ట్రం మాత్రం చేయనీయబోమని చెప్పడం ఏమిటో అర్థం కావడం లేదని తెలిపారు. రాష్ట్రం చెప్పింది నిజమనుకోవాలంటే విశాఖ స్టీలును ప్రైవేటీకరించడం లేదని ప్రధానితో ప్రకటన చేయించాలని అన్నారు. పార్లమెంటులో టిడిపి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టుబడితే కేంద్రం దిగొస్తుందని, ఈ సమావేశాల్లో రెండు పార్టీలూ చిత్తశుద్ధి ఉంటే ఆ పనిచేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆర్సెల్లార్ మిట్టల్ స్టీలు ప్లాంటును రాయలసీమ పరిధిలో ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ప్రకాశం జిల్లాలో రామాయపట్నం పోర్టుకు దగ్గర్లో ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. ఇప్పటికే కడప స్టీలు ప్లాంటుకు అనుమతి ఉన్న నేపథ్యంలో అక్కడ పెట్టే ఆలోచన చేయాలని సూచించారు.

రాష్ట్రాల హక్కులపై దాడి

గతంలో పూర్తి బలంతో అధికారంలో ఉన్న బిజెపి దాన్ని వ్యతిరేకించే రాష్ట్రాల హక్కులపై తీవ్ర దాడి చేసిందని, ప్రస్తుతం అంత బలం లేకపోయినా అదే ఒరవడి కొనసాగిస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబీ అన్నారు. ఎపిలో జరిగిన అవినీతి వ్యవహారాలపై మోడిగానీ, విచారణ ఏజెన్సీలు గానీ కనీసం ప్రస్తావించలేదన్నారు. సాగర్ అదానీపై అమెరికాలో కేసు నమోదైనా ఇక్కడ ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ అవినీతి ప్రభావం ప్రజలపై తీవ్రంగా ఉంటుందని, భవిష్యత్‌లో విపరీతమైన భారాలు పడతాయని పేర్కొన్నారు. మణిపూర్‌లో హింసను ఆపేందుకు మోడీ ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని, పైగా దాడులకు మోడీ, అమిత్‌షా ప్రోత్సాహం ఇస్తున్నారని తెలిపారు. అక్కడ ముఖ్యమంత్రిని కాపాడుతున్నారని తెలిపారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అరాచకం చేస్తూ వ్యతిరేకించే రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని తెలిపారు. ఇప్పటికే బిజెపి తీరును వ్యతిరేకిస్తూ కేరళ, బెంగుళూరులో సమావేశాలు జరిగాయని గుర్తు చేశారు. కేరళలో వయనాడ్ విపత్తు జరిగితే కేంద్రం నుండి రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు.

వక్ఫ్ సవరణను వ్యతిరేకిస్తున్నాం

వక్ఫ్ చట్టానికి సవరణలు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వక్ఫ్‌లో బిజెపి అనుకూలురును పెట్టి దెబ్బతీసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, ఇటువంటి అనాగరికమైన నిర్ణయాలను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈ తరహా నిర్ణయాలను వెనక్కు తీసుకునేలా టిడిపి, జనసేన కూడా పార్లమెంటులో పోరాడాలని కోరారు. అదానీ రాష్ట్రానికి వచ్చిన సమయంలోనే సిపిఎం గా తాము వ్యతిరేకించామని శ్రీనివాసరావు వెల్లడించారు. అప్పట్లో ఆయనతో జరిగిన ఒప్పందాలు బయటపెట్టాలనీ డిమాండ్ చేశామని, ప్రభుత్వం మిన్నకుండిపోయిందని తెలిపారు. నాడు టిడిపి కూడా మాట్లాడలేదన్నారు. ఈ ఒప్పందంలో అవినీతి జరిగిన విషయం తమ దృష్టిలో ఉందని అసెంబ్లీలో చంద్రబాబు చెప్పిన నేపథ్యంలో ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని, లేనిపక్షంలో అవినీతిని చంద్రబాబు కూడా సమర్థించినట్లు భావించాల్సి వస్తుందని తెలిపారు. ప్రజలపై భారీగా ట్రూఅప్ భారం పడుతోందని, చిత్తశుద్ధి ఉంటే ఒప్పందంతోపాటు, ట్రూఅప్ భారాలను కూడా టిడిపి కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని శ్రీనివాసరావు డిమాండు చేశారు.

పాన్ 2.0 ప్రాజెక్టుకు రూ.1,435 కోట్లు

కేంద్ర కేబినెట్ కమిటీ ఆమోదం

న్యూఢిల్లీ : పాన్ 2.0 ప్రాజెక్టుకు రూ.1,435 కోట్ల కేటాయింపునకు కేంద్ర కేబినెట్ కమిటీ సోమవారం ఆమోద ముద్ర వేసింది. ఈ ప్రాజెక్టు కింద కేంద్రప్రభుత్వ అన్ని సంస్థల డిజిటల్ సిస్టమ్‌లకు శాశ్వత ఖాతా సంఖ్య (పాన్)ను 'కామన్ బిజినెస్ ఐడెంటిఫైయర్'గా మారుస్తారు. ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) ఆమోదం తెలిపింది. ఈ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. పన్ను చెల్లింపుదారుల రిజిస్ట్రేషన్ సేవల్లో మరింత సాంకేతికతకు, ఉత్తమ నాణ్యత, సులభంగా యాక్సెస్, వేగవంతమైన సేవలు.. ఈ ప్రాజెక్టు లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ సంస్థల్లో అన్ని డిజిటల్ సిస్టమ్‌లకు పాన్‌ను సాధారణ ఐడెంటిఫైయర్‌గా ఉపయోగించడం ప్రారంభించడంతో డిజిటల్ ఇండియాలో పాన్ 2.0 ప్రాజెక్టు ప్రతిధ్వనిస్తుందని మంత్రి చెప్పారు. దేశంలో ఇప్పటి వరకూ దాదాపు 78 కోట్ల పాన్‌లు జారీ చేయబడ్డాయి. సోమవారం కేబినెట్ కమిటీ రూ.2750 కోట్లతో అటల్ ఇన్నోవేషన్ మిషన్, రూ.2481 కోట్లతో 'ప్రకృతి వ్యవసాయంపై జాతీయ మిషన్', రూ.3,689 కోట్లతో అరుణాచల్ ప్రదేశ్‌లో రెండు జలవిద్యుత్ ప్రాజెక్టులకు కూడా ఆమోదం తెలిపింది. విద్యార్థుల కోసం వన్ నేషన్– వన్ సబ్‌స్క్రిప్షన్ పథకం ప్రవేశపెట్టనున్న కేంద్రం, ఇందుకోసం రూ.6 వేల కోట్లు కేటాయించనుందని మంత్రి తెలిపారు. ఇందులో ప్రముఖ యూనివర్శిటీల జర్నల్స్, పరిశోధన పత్రాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

విజయ్‌పాల్ బెయిల్ దరఖాస్తు తిరస్కరణ

- సుప్రీం కోర్టు

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

మాజీ ఎంపి, తాజా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో సిఐడి మాజీ అదనపు ఎస్‌పి విజయ్‌పాల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలని విజయ్‌పాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర ప్రభుత్వం, రఘురామకృష్ణరాజు, విజయ్‌పాల్ తరపు న్యాయవాదుల సుదీర్ఘ వాదనల అనంతరం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బి. వరలేతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది. కస్టోడియల్ టార్చరే జరగలేదని, అరెస్టు వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని విజయ్‌పాల్ సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వి వాదించారు. 2021లో ఘటన జరిగితే, మూడేళ్ల తరువాత ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ జరుపుతున్నారని అన్నారు. ఏ కోర్టు రఘురామరాజుకు టార్చర్ చేసినట్లు ధ్రువీకరించలేదని వాదించారు. అరెస్టు నుంచి సుప్రీం కోర్టు బెయిల్ ఇచ్చి, ఆర్మీ ఆసుపత్రికి చికిత్స కోసం పంపించిన తీరును ధర్మాసనానికి రాష్ట్రప్రభుత్వం తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్ర వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సికింద్రాబాద్ ఆర్మీ ఆసుపత్రి వైద్య నివేదిక కూడా ఇచ్చిందని, దానిలో స్పష్టంగా అన్ని అంశాలు ఉన్నాయని చెప్పారు. మేజిస్ట్రేట్ ఎదుట ప్రవేశ పెట్టినప్పుడు కాళ్లకు అయిన గాయాలను న్యాయాధికారికి చూపించారని, ఆ వివరాలను అధికారికంగా నమోదు చేశారని రఘురామకృష్ణరాజు తరపు న్యాయవాది సుయోధన్ ధర్మాసనానికి తెలిపారు. మేజిస్ట్రేట్ నమోదు చేసిన వివరాలపై మీ దగ్గర సమాధానం ఉందా? అని విజయ్‌పాల్ న్యాయవాది సింఘ్విని ధర్మాసనం ప్రశ్నించింది. ఎలాంటి సమాధానం చెప్పకపోవడంతో కేసు విచారణను ధర్మాసనం ముగించింది. విజయ్‌పాల్ పిటిషన్ కొట్టివేస్తూ ధర్మాసనం ఆదేశాలిచ్చింది.

అదానీ విరాళాన్ని స్వీకరించబోం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని తమ ప్రభుత్వం తిరస్కరిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దాన్ని స్వీకరించబోమని తెలిపారు. ఈ మేరకు అదానీ ఫౌండేషన్‌కు లేఖ రాశామని వెల్లడించారు. అదానీ గ్రూప్‌పై అవినీతి, లంచాలు తదితర ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని సిఎం ప్రకటించారు. సోమవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులతో కలిసి సిఎం విలేకరులతో మాట్లాడారు.

అదానీ గ్రూపుతో తమిళనాడుకు వాణిజ్య సంబంధాలు లేవు : సిఎం స్టాలిన్

చెన్నై : తమినాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (టిఎఎన్‌జిఇడిసిఓ)కు అదానీ గ్రూపు కంపెనీలకు మధ్య ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తెలిపారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి వి సెంథిల్‌బాలాజీ గతంలో చేసిన ప్రకటనను ముఖ్యమంత్రి సమర్థించారు. సోమవారం విలేకరులు అదానీ గ్రూపు గురించి ప్రస్తావించగా 'ఈ విషయం గురించి ఆ శాఖ (విద్యుత్) మంత్రి సెంథిల్‌బాలాజీ మాట్లాడారు. దయచేసి దాన్ని వక్రీకరించవద్దు' అని ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు. టిఎఎన్‌జిఇడిసికి అదానీ గ్రూపునకు ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవని తెలిపారు.

విద్యాసంస్థలు ప్రారంభించడాన్ని పరిశీలించండి

- సిఎక్యూఎంకు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ : ఢిల్లీ, దేశ రాజధాని ప్రాంతంలో విద్యాసంస్థలను పున:ప్రారంభించడాన్ని పరిశీలించాలని, వీటికి జిఆర్‌ఎపి–4 నిబంధనలు సడలించడంపై తక్షణమే ఆలోచించి, నిర్ణయాన్ని తెలపాలని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎక్యూఎం)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. సోమవారం సాయంత్రానికి కానీ, మంగళవారం ఉదయానికి కానీ నిర్ణయాన్ని తెలపాలని జస్టిస్ ఎఎస్ ఒకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం సిఎక్యూఎంను సోమవారం ఆదేశించింది. అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఈ ఆదేశాలు జారీ చేయడానికి మూడు ప్రధాన కారణాలను ధర్మాసనం ప్రస్తావించింది. ఎక్కువ మంది విద్యార్థుల ఇళ్లల్లో ఎయిర్ ప్యూరిఫయర్లు లేవని, మధ్యాహ్న భోజన పథకం సౌకర్యం కోల్పోతున్నారని పేర్కొంది. ఎక్కువ మంది విద్యార్థులకు ఆన్‌లైన్ విద్యలో పాల్గొనడానికి సౌకర్యాలు లేవని, ఆన్‌లైన్ తరగతులు కొనసాగితే వీరంతా వెనకబడిపోతారని ధర్మాసనం తెలిపింది. 10, 12 తరగతులను పున:ప్రారంభించాలా? వద్దా? అనే విషయంపై నిర్ణయాన్ని సిఎక్యూఎంకే సుప్రీంకోర్టు వదిలివేసింది. ఈ నెల 18 నుంచే జిఆర్‌ఎపి–4 నిబంధనలు అమల్లోకి వచ్చినా కాలుష్యకారక వాహనాలను నిరోధించేందుకు ఢిల్లీ ఎంట్రన్స్ కేంద్రాల వద్ద పోలీసు సిబ్బందిని మోహరించకపోవడాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది.

రాష్ట్రంలో తొలి కంటైనర్ ఆస్పత్రి

(మొదటి పేజీ తరువాయి)

తొలి కంటైనర్ ఆస్పత్రిని ప్రారంభించామని తెలిపారు. బెల్లపాక, బొడ్డపాడు, నరింజపాడు, కరడవలస, కరడకోటవలస (సాలూరు మండలం)తో పాటు చాకిరేవువలస, కంకనపల్లి, ఆజూరు, కుంబివలస (పాచిపెంట మండలం) గ్రామాలకు దీని సేవలు అందుబాటులో ఉంటాయని, డోలీ మోత తప్పుతుందని వివరించారు. గిరిజన గ్రామాలు, కొండ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా దీనిని రూపొందించామని తెలిపారు. సుమారు రెండు వేల మంది గిరిజనుల ఆరోగ్య అవసరాలను తీర్చడంలో ఇది ముందడుగని పేర్కొన్నారు. ప్రాథమిక వైద్యం కోసం దూరం ప్రయాణించాల్సిన అవసరాన్ని ఇది తగ్గిస్తుందన్నారు. ఇందులో వారానికి ఒకసారి వైద్యాధికారి ఒపి సేవలందిస్తారని, నెలకు రెండుసార్లు రెండు, నాలుగు బుధవారాల్లో 104 మొబైల్ మెడికల్ యూనిట్ ఇక్కడికి వస్తుందని తెలిపారు. ఎఎన్‌ఎం, ఎంఎల్ హెచ్‌పి వారానికి మూడుసార్లు ఇక్కడ ఒపి సేవలందిస్తారని వివరించారు. ఆశా కార్యకర్త ప్రతిరోజు ఇక్కడ అందుబాటులో ఉంటారని, 105 రకాల మందులు ఉంచామని మంత్రి తెలిపారు. గర్భిణుల్లో రక్తహీనత కలిగిన వారు ఆస్పత్రికి వెళ్లే అవసరం లేకుండా ఐరన్ ఇంజక్షన్లు ఇక్కడే చేయించుకోవచ్చన్నారు. నెలకు ఒకసారి గర్భిణులకు ఇక్కడ తనిఖీలు, రక్త పరీక్షలు చేస్తారని తెలిపారు. మలేరియా, డెంగీ, షుగర్, హెచ్‌బి, హెపటైటిస్, హెచ్‌ఐవి, టిబి–కెల్ల, యూరిన్, హెచ్‌సిజి, కంటి చూపు తదితర 14 రకాల పరీక్షలు ఇక్కడ చేస్తారని వివరించారు. చిన్న పిల్లలకు టీకాలు వేస్తారని, ప్రతి నెల రెండో శనివారం సార్వత్రిక రోగనిరోధక కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ గిరి ప్రాంతాల్లో ముఖ్యంగా రక్తహీనత లోపం ఉందని, ఈ నేపథ్యంలో ఎనీమియా యాక్షన్ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమిటీ 15 రోజులకు ఒకసారి గర్భిణులకు, బాలింతలకు, ఐదేళ్లలోపు పిల్లల ఆరోగ్యం, పోషణ గురించి అవగాహన కల్పిస్తుందని వివరించారు. కౌమార దశలో ఉన్న బాలబాలికలకు ప్రత్యేక ఆరోగ్య సదస్సు ఇక్కడ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పద్మావతి, పలు శాఖల అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మీకోసం

దుస్తుల మీద పడిన కఠిన మరకలు, స్టిక్ ఐటెమ్స్‌ను తొలగిస్తుంది. వేళ్లకు ఉన్న నెయిల్ పాలిష్‌ను తొలగిస్తుంది.

జీవన సౌరభం

ప్రతిభ ఉండి ఆత్మవిశ్వాసం లేకపోతే ఏ రంగంలోనైనా సరిగ్గా రాణించలేరు.

ఓ అమ్మ సుదీర్ఘ న్యాయ పోరాటం!



ఇది ఒక యథార్థ సంఘటన.. బిడ్డ ఆనవాళ్ల కోసం 18 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసిన ఓ తల్లి కథ.. ఆ బిడ్డకి ఏమైంది.. ఆ తల్లి ఏం చేసింది.. తెలుసుకుంటుంటే ఆద్యంతం ఉత్కంఠ రేగుతుంది. ఓ మర్డర్ మిస్టరీ సినిమాలో వచ్చే మలుపులు, ఎత్తులు ఈ పేదతల్లి తన జీవితంలో చూసింది. బిడ్డ లేదన్న చేదు నిజాన్ని పంటిబిగువున బిగబట్టి ఏళ్లకు ఏళ్లు న్యాయం కోసం ఎదురుచూసింది. చివరికి 2024 నవంబరు 11న ఆ తల్లి నిరీక్షణకు తెరపడింది. పొత్తిళ్ల బిడ్డని తన అరచేతుల్లో ఆడించిన ఆ తల్లే.. ఆ రోజు తన కూతురు అస్తికలని ఒడిలోకి తీసుకుని బోరున ఏడ్చింది. ఆ క్షణం ఆమె గెలిచినట్లా.. ఓడినట్లా.. అసలు ఏం జరిగింది?

నవంబరు 11న కేరళ కాసర్‌గోడ్ కోర్టు ప్రాంగణం ఒకటే హడావిడిగా ఉంది. మీడియా అంతా అక్కడే ఉంది. మధ్యాహ్నం 2 గంటలకు బక్కపల్చని ఇద్దరు వృద్ధ దంపతులు మొయితు, ఆసిఫా లీగల్ కౌన్సిల్ దగ్గర వేచిచూస్తున్నారు. అవసరమైన పేపర్ వర్క పూర్తి చేశారు. కోర్టు నుంచి వారికి ఒక పార్శిల్ వచ్చింది. అందులో ఉన్న వస్తువు ఆ పెట్టే బరువు కంటే తక్కువగా ఉన్నట్లు ఉంది. వాళ్లిద్దరూ ఎంతో ఆతృతగా పెట్టెని తెరిచారు. అందులో ఓ తెల్లని వస్త్రంలో చుట్టిన చిన్నపిల్ల పుర్రె ఉంది. అది చూసిన ఆసిఫా గుండెలు బాదుకుంటూ నెత్తినోరు కొట్టుకుంటూ బిగ్గరగా ఏడ్చింది. ఆ పుర్రెని చేతుల్లో తీసుకున్న మొయితూ 'తల్లీ ఇప్పటికి నా దగ్గరకి వచ్చావా?' అని హత్తుకున్న దృశ్యం, అక్కడున్న వాళ్లందరినీ కళ్లనీళ్ల పర్యంతం చేసింది. ఈ విషాధ గాథ ఇక్కడి నుండే మొదలుపెట్టాలి..

చదివిస్తామన్నారు..

మొయితు కుటుంబం కాసర్‌గోడ్ లో నివసిస్తోంది. దినసరి కూలీ చేసి కుటుంబాన్ని పోషించేవాడు. చాలీచాలని సంపాదనతో బిడ్డలకి తిండి పెట్టడమే కష్టమయ్యేది. అలాంటి పరిస్థితుల్లో పొరుగింటి నుంచి ఓ ప్రతిపాదన అతని ఇంటికి వచ్చింది. కర్నాటక, గోవాలో వ్యాపారం చేస్తున్న తమ ఇంట్లో చిన్న పిల్లలని చూసేందుకు ఓ కేర్‌టేకర్ కావాలని, మొ యితు కూతురు సాఫియాని తమతో పంపించమని హంస, మైమూనా దంపతులు కోరారు. దానికి మొయితు దంపతులు అంగీకరించలేదు, ఆ పేదతండ్రిని ఎలాగైనా ఒప్పించాలన్న లక్ష్యం ఉన్న హంస, తమతో పంపిస్తే, సాఫియాకి చదువు కూడా చెప్పిస్తామని నమ్మబలికాడు. ఈసారి మొయితు ఏ అభ్యంతరం చెప్పలేదు. అలా 18 ఏళ్ల క్రితం, 2006లో 13 ఏళ్ల సాఫియా ఇంటి నుండి బయటికి వెళ్లింది.

బిడ్డ కోసం ఎంతో తపించింది..

అక్కడికి వెళ్లినదగ్గర నుంచి సాఫియా తల్లిదండ్రులతో స్వేచ్ఛగా మాట్లాడేది కాదు. బిడ్డ గుర్తుకు వచ్చినప్పుడల్లా తనని చూసేందుకు వెళ్లాలంటే దారి ఖర్చులు కూడా మొయితు దగ్గర వుండేవి కావు. ఈ పరిస్థితుల్లో బిడ్డపై ఉన్న కొండంత ప్రేమని గుండెల్లోనే దాచుకుని ఆ దంపతులు కాలం వెల్లదీశారు. అక్కడ.. హంస చేసిన వాగ్దానాలేవీ అమలు చేయలేదు. బడికి పంపలేదు. చిన్నారి సాఫియాతో ఇంటి చాకిరీ చేయించేవారు. కర్నాటక నుంచి గోవాకి మకాం మార్చారు. ఈ విషయం కూడా మొయితుకి చెప్పలేదు. తన కూతుర్ని ఇంటికి పంపించేయమని ఆసిఫా ఎన్నోసార్లు బతిమాలేది. కానీ, వారు పట్టించుకోలేదు. బిడ్డ మీద దిగులుతో ఆ తల్లి భారంగా రోజులు గడిపింది.

పారిపోయిందని చెప్పారు..

2006 డిసెంబరు 20న హంస నుంచి మొయితుకి ఫోన్ వచ్చింది. తన సొంత నివాసం కాసర్‌గోడ్‌కి వచ్చి సాఫియాని తీసుకెళ్లమని దాని సారాంశం. సాఫియాని చూస్తానన్న కొండంత ఆశతో మొయితు పయనమయ్యాడు. కానీ అక్కడ.. సాఫియా లేదు. బిడ్డని ఆడిస్తానని వెళ్లిన తను ఆ రోజే కనిపించకుండా పోయిందని హంస చెప్పాడు. మొయితు ఇది ఊహించలేదు. ఊరంతా వెదుకుదా మని హంస తనతో తీసుకెళ్లాడు. అయినా తన జాడ లేదు. చీకటిపడిన తరువాత మిస్సింగ్ కేసు ఫైల్ చేద్దామని పోలీసు స్టేషనుకి తీసుకెళ్లాడు. అసలు ఏం జరుగుతుందో అర్థం కాని అయోమయ స్థితిలోనే మొయితీ కంప్లైంట్ ఫారం పూర్తి చేసి, ఒట్టి చేతుల్తో ఇంటికి చేరుకున్నాడు.

మొయితుని జైల్లో వేశారు

ఈ విషయాలేవీ మొయితు, ఆయేషాకి చెప్పలేదు. బిడ్డ క్షేమంగా ఉందని నమ్మబలికాడు. రెండు రోజుల తరువాత పోలీస్ స్టేషను నుంచి మొయితు దంపతులకు సమన్లు వచ్చాయి. హంస అక్కడే ఉన్నాడు. బిడ్డని మొయితునే దాచి, డబ్బుల కోసం తనపై ఫాల్స్ కంప్లైంట్ పెట్టాడని హంస ఆరోపిం చాడు. పోలీసులు మొయితు ని జైల్లో వేశారు. చంకలో చంటి బిడ్డని వేసు కుని పోలీసుస్టేషనుకి వెళ్లిన ఆయే షాకి ఏం జరుగుతుందో అర్థం కాలేదు. ఏడుస్తూనే ఉంది.

కొన్ని రోజులకు పోలీసులు మొయితుని విడుదల చేశారు. అయితే ఈసారి ఆయేషా మౌనంగా కూర్చోలేదు. తన కూతురు ఏమైంది? ఎక్కడికెళ్లింది? హంస ఏం చేశాడు? తెలుసుకోవాలనుకుంది. స్థానిక కౌన్సిల్‌ని సంప్రదించింది. కొంతమంది సామాజిక కార్యకర్తలు కూడా ఆమెతో కలసివచ్చారు. సాఫియా మిస్సింగ్ కేసును సీరియస్‌గా విచారించేలా పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చారు.

120 రోజుల నిరాహార దీక్ష

వందలమంది ఏకమై 120 రోజుల పాటు సత్యాగ్రహం చేశారు. ఈ నిరసన దీక్షలో కాసర్‌గోడ్ బయట నుంచి కూడా చాలామంది పాల్గొన్నారు. క్రైమ్ బ్రాంచ్ జోక్యం చేసుకోవాలన్న వాళ్ల డిమాండ్‌కి అధికారులు తలొంచారు. ఈ మొత్తం నిరసనలో ఆయేషా పడిన తపన గురించి నిరసనకారుడు సుబేయర్ ఇలా చెబుతాడు : 'ఇన్ని రోజులు.. ఇంతమందిమి నిరసనలో పాల్గొన్నామంటే, మా వెనుక ఆయేషా అనే బలమైన పట్టుదల ఉంది'.

ముక్కలు ముక్కలు చేశారు

2015 జులై 16న సాఫియాని దారుణంగా హత్య చేసినందుకు హంసకి ఉరిశిక్ష పడింది. కేసు విచారణలో భయంకర నిజాలు వెలుగుచూశాయి. సాఫియా కనిపించకుండా పోయిందని హంస చెప్పిన ఐదు రోజులకు ముందే తను దారుణంగా హత్యకు గురైంది. ఆ రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంటగదిలో ఉన్న సాఫియాపై హంస పొరబాటున వేడినీళ్లు పోశాడు. ఆ వేడికి తన ఒళ్లంతా కాలిపోయింది. మైనర్‌ని పనిలో పెట్టుకున్నారని కేసు పెడ్తారన్న భయంతో హాస్పటల్‌కి తీసుకెళ్లలేదు. వేరే అపార్ట్‌మెంట్‌కి మార్చాడు. అక్కడ ఓ పదునైన కత్తితో ఆమె చనిపోయేదాకా మెడపై గాయాలు చేశాడు. శరీరాన్ని ముక్కలుముక్కలుగా నరికాడు. సంచుల్లో వేసుకుని గోవా, బెల్గాం జాతీయ రహదారి వైపు కారులో తీసుకెళ్లాడు. ఈ మొత్తం వ్యవహారంలో హంస స్నేహితులు కూడా అతనికి సహాయం చేశారు. దూరంగా అడవిలో పారేశారు. అయితే తమను ఎవరో చూశారన్న అనుమానంతో ఆ సంచులని మళ్లీ వెనక్కి తీసుకువచ్చి స్నేహితుడి సొంత స్థలంలో పాతిపెట్టారు.


నిందితులంతా బయటే ఉన్నారు

పక్కా ప్రణాళికతో ఈ మొత్తం వ్యవహారాన్ని హంస నడిపించాడు. పోలీసులను ప్రలోభపెట్టాడు. గోవా నుంచి కాసర్‌గూడకి సాఫియా వచ్చినట్లు మొయితుకి చెప్పించాడు. సాఫియా మిస్సింగు వెనుక ప్రేమ వ్యవహారం ఉందని ప్రచారం చేశాడు. ఇంత దారుణం చేసిన హంస ఇప్పుడు ఉరిశిక్ష నుంచి బయటపడి జీవితఖైదుని అనుభవిస్తున్నాడు. అతనికి సహాయం చేసిన భార్య, స్నేహితులు మూడేళ్ల శిక్ష అనుభవంచి బయటికి వచ్చేశారు.

క్రైమ్ బ్రాంచ్ పరిశోధనలో వెలుగుచూసిన ఈ భయంకర నిజాలకు ఆయేషా గుండె బద్దలైంది. పాతిన చోట ఆయేషా ఆనవాళ్లుగా ఆమె ఎముకలే మిగిలాయి. 'ఈ ఘోరం ఎవరికీ జరగకూడదు. అందుకే నేను ఈ పోరాటం చేశాను. నాకు కలిగిన ఈ నష్టం ఎవ్వరూ పూడ్చలేరు. నా బిడ్డని కలుసుకోలేకపోయాను. కనీసం మా మతాచారం ప్రకారం ఆమెకి సంబంధించినవి ఏవైనా మాకు అప్పగించండని అభ్యర్థించాను. ఇదిగో నా కూతురుని ఇలా అప్పజెప్పారు' అని ఆయేషా బిగ్గరగా రోదిస్తున్న చోటుకి కాస్త దూరంగా ఆమె 120 రోజులు నిరాహార దీక్ష చేసినప్పుడు సాక్ష్యంగా నిలిచిన పచ్చని 'సిగ్నేచర్ ట్రీ' (సంతకాల చెట్టు) మోడై తన విచారాన్ని వ్యక్తం చేసింది.

(2022లో రోడ్డు విస్తరణలో భాగంగా కాసర్‌గోడ్ బస్టాండుకు ఆనుకుని వున్న సిగ్నేచర్ ట్రీని తొలగించారు)

సాగర గీతం



జలవస్త్రం కట్టుకుంది
చూడూ చూడు సంద్రం !
గళం విప్పి స్వగతాన్నే
పాడుకుంది సంద్రం!

నీలిరంగు ఆకాశం
నేలకు చేరిందా?
నీలిరంగు దుప్పటినే
కప్పుకుంది సంద్రం!

తన పాపలు తరంగాలు
తీరాలను దాటబోరు
క్రమశిక్షణ ఉండాలని
చెప్పుకుంది సంద్రం!
వేర్వేరు వర్గాలను
ఆదరించు సుగుణముంది
పారే నదులను హృదిలోది
కలుపుకుంది సంద్రం!

'విషాదమే వినోదమా?
నా నెత్తిన పోస్తారా'
'చెత్తబుట్టనా' అంటూ
కసరుకుంది సంద్రం!

'అయ్యో! ఈ నరులకంట
పడితే అవి దక్కేనా?'
రత్నాలను తన కడుపున
దాచుకుంది సంద్రం!

గుండెపైన చేప పాప
లన్నీ తిరుగాడంగా
'గంపెడు పిల్లలు నాకని'
ఎత్తుకుంది సంద్రం!

విషవాయు పీల్చలేక
దిగులు చెంది అనునిత్యం
బొగ్గుపులుసు లావు చూచి
నొచ్చుకుంది సంద్రం!

- కిలపర్తి దాలినాయుడు
సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు
జిల్లా పరిషత్ ఉన్నత
పాఠశాల,రామభద్రపురం

నేను గీసిన బొమ్మ






జుజ్జవరపు బ్యూల
4వ తరగతి, ఎంపిఎస్,
వానపాముల (హెచ్‌డబ్ల్యు),
పెదపారుపూడి(మం), కృష్ణాజిల్లా.

దారి చూపండి

కుక్కపిల్ల బాలుతో ఆడుకోవాలి. మరి దారి చూపి సాయం చేయరూ!



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి.
ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68